జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 79 విశాఖపట్నం శనివారం 04 డిసెంబరు 2021 8 పేజీలు వెల : 5.00

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523



## ప్రజల నమ్మకంతో ఫిన్‌టెక్ విప్లవం: మోదీ

న్యూఢిల్లీ : ప్రతి పౌరుడు ఆర్థిక సాధికారత సాధించడానికి ఫిన్‌టెక్ విప్లవం రావాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆర్థికపరంగా అందరినీ కలుపుకొనిపోవడం ఈ విప్లవానికి చోదక శక్తి అని చెప్పారు. భారతీయ డిజిటల్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం వల్ల ఈ రంగంలో మన దేశం చెప్పుకోదగ్గ ప్రగతి సాధించిందన్నారు. ఇన్‌కమ్, ఇన్వెస్ట్‌మెంట్స్, ఇన్సూరెన్స్, ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్ అనే నాలుగు స్తంభాలపై ఫిన్‌టెక్ ఆధారపడిందని తెలిపారు.

(మిగతా 2లో..)

### వరద సాయం అందనివారు గ్రామ సచివాలయంలో ...

# దరఖాస్తు చేయండి

## వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండవ రోజు పర్యటించిన జగన్





నెల్లూరులో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి జగన్

నెల్లూరు, డిసెంబరు 03 ప్రజాపాలన ప్రతినిధి: వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించారు. దీనిలో భాగంగా శుక్రవారం నెల్లూరు జిల్లాలో పర్యటన ముగిసిన అనంతరం సీఎం జగన్ తిరుగు పయనమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాలు దామరపాలెం, జొన్నవాడ, పెనుబల్లి, భగత్ సింగ్ కాలనీల్లో పర్యటించిన సీఎం జగన్ ముంపు బాధితులకు అందిన సహాయక చర్యలపై అరాతీశారు. నష్టపోయిన ప్రతీ కుటుంబానికీ అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీఇచ్చారు. వరద సహాయక చర్యలపై ముంపువాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. వేళాంగిణి అనే మహిళ ఆవేదన విన్న సీఎం జగన్ చలించిపోయారు. ఆమె కొడుక్కి ఉద్యోగం కల్పించి అదుకొంటానని మహిళకు సీఎం హామీఇచ్చారు. బీఎంఆర్ ట్రస్ట్ తరఫున వరద సహాయం కోసం రూ.కోటి చెక్కును బీదా మస్తాన్ రావు సీఎంకు అందజేశారు. ఢీసీఎంఎస్ నిధుల నుంచి రూ. 25 లక్షల వరద సహాయం చెక్కున్ ఛైర్మెన్ వీరి చలపతి సీఎం వైఎస్ జగన్‌కు అందచేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. వరద పరిస్థితిపై అధికారులతో పూర్తిగా మాట్లాడినట్లు తెలిపారు. వరద బాధితులకు ఇంటికి రూ. 2వేలతో పాటు రేషన్ కూడా అందినట్టు అందరూ చెబుతున్నారని తెలిపారు. రానివాళ్లు 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పెన్నానది నుంచి వరద నివారణ కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కరకట్ట బండ్ నిర్మాణానికి రూ. 100 కోట్లు మంజూరు (మిగతా 2లో..)



## సర్కార్‌కు కేంద్రం హెచ్చరిక

అమరావతి: ఏపీ సర్కార్‌కు కేంద్రం హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లను మార్చడం కుదరదని కేంద్రం తేల్చిచెప్పింది. కేంద్ర పథకాలను జగనన్న గోరుముద్ద, జగనన్న పాలు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేర్లు పెట్టడంపై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర పథకాల పేర్లు మార్చడంపై కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ నివేదిక కోరింది. 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో ఐసీడీఎస్, ఐసీపీఎస్ పథకాలకు కేంద్రం కేటాయించిన రూ.187 కోట్లకు లెక్క చూపాలని కేంద్రం ఆదేశించింది. పథకాల పేర్లపై ఇటీవల కేంద్రమంత్రి స్మృతి ఇరానీకి ఎంపీ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. రఘురామ ఫిర్యాదుపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది.

# తుఫానుగా వాయుగుండం

**జవాద్ తుపానుగా మారిన వాయుగుండం**

**విశాఖ తీరానికి సమీపం నుంచి ఒడిశా వైపు పయనం**

**45-90 కిలోమీటర్ల వేగంతో తీరంలో గాలులు**

**ఉత్తరాంధ్రలో రెండు రోజులు భారీ వర్షాలు..**

**వేటకు వెళ్లరాదని మత్స్యకారులకు హెచ్చరిక**



అమరావతి/విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. విశాఖకు 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం మరింత బలపడి శుక్రవారం మధ్య బంగాఖాళాతంలో జవాద్ తుపానుగా మారురిందని విపత్తుల నిర్వహణశాఖ కమిషనర్ కె.కన్నబాబు, విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇది తరువాత వాయవ్య దిశలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం తీరం వరకు ప్రయాణించి శనివారం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు చేరే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో (మిగతా 2లో..)

# మూతపడిన ఢిల్లీ విద్యాసంస్థలు..

## మళ్లీ ఆన్‌లైన్ క్లాసులు!!



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వాయు కాయులష్యం తీవ్రస్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో అన్ని విద్యాసంస్థలను మూసివేయవల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ఎయిర్ క్వాలిటీ ప్యానెల్ సూచనల మేరకు శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. దీనితో ఢిల్లీలోని అన్ని ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్లలోని ఆఫ్‌లైన్ క్లాసులన్నీ రద్దుచేయబడ్డాయి. అంతేకాకుండా సుప్రీంకోర్టు కూడా ఈ విషయంతో మరింత కఠినంగా వ్యవహరించింది. వాయుకాలుష్యం కారణంగా ఉద్యోగులందరికీ వర్క్ ఫ్రం హోమ్ ఇచ్చారు. మరి విద్యార్థులు మాత్రం స్కూళ్లకు ఎందుకు వెళ్లాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీంతో ఢిల్లీ ప్రభుత్వం దేశ రాజధానిలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను తాత్కాలికంగా మూసివేయవల్సిందిగా ఆదేశించింది. ఆన్‌లైన్‌లో మాత్రమే తరగతులు నిర్వహించవల్సిందిగా సూచించింది. ఐతే పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహణకు విద్యాసంస్థలను తెరవచ్చని కూడా పేర్కొంది. కాగా బుధవారం ఢిల్లీ వాయు నాణ్యత మరింత క్షీణించింది. గురువారం నాటికి పరిస్థితి ఇంకా అద్వాన్నంగా మారింది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికల ప్రకారం.. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో బుధవారం ఢిల్లీ వాయునాణ్యత 370గా నమోదుకాగా, గురువారం ఉదయం 7 గంటల సమయంలో 416గా చూపించింది. ఈ మేరకు ఢిల్లీ ప్రభుత్వం ఆఫ్‌లైన్ క్లాసులన్నింటినీ రద్దు చేసింది.

# పంజాబ్‌లోనే ఆక్సిజన్ కొరతతో మరణాలు: కేంద్రం



న్యూఢిల్లీ: కరోనా సెకెండ్ వేవ్‌లో ఆక్సిజన్ కొరతతో సంభవించిన మరణాలపై డాటా అడిగినప్పుడు 19 రాష్ట్రాలు స్పందించాయని, పంజాబ్ మాత్రమే నాలుగు అనుమాస్పద మరణాలు సంభవించినట్టు రిపోర్ట్ చేసిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ శుక్రవారంనాడు లోక్‌సభలో ఈ విషయం తెలిపారు. మహారాష్ట్ర ఎంపీ బి.ధనరోర్కర్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి స్పందిస్తూ, సెకెండ్ వేవ్ ప్రారంభమైనప్పటి నుంచి దేశంలో ఆక్సిజన్ లభ్యతపై రాజకీయాలు మొదలయ్యాయని అన్నారు. ''ఆక్సిజన్ రోజువారీ అవసరం 900 నుంచి 1,000 మెట్రిక్ టన్నులు. మొదటి వేవ్‌లోనే 1,400 మెట్రిక్ టన్నులకు లభ్యతను పెంచాం. రెండో వేవ్‌లోనూ ఆక్సిజన్ కెపాసిటీని కూడా పెంచాం. విదేశాల నుంచి కూడా ట్యాంకర్ల ద్వారా ఆక్సిజన్ తెప్పించాం. నావికాదళంతో పాటు వైమానిక సిబ్బంది సేవలు వినియోగించుకున్నాం''అని మంత్రి తెలిపారు. ఈరోజు ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యం 4,500 మెట్రిక్ టన్నులుగా ఉందని ఆయన సభకు వివరించారు. కేంద్రం శక్తివంచన లేకుండా అన్ని రకాల ప్రయత్నాలు చేసినప్పటికీ కొందరు రాజకీయాలు చేయాలని చూశారని పరోక్షంగా ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వాన్ని మన్సుక్ మాండవీయ తప్పుపట్టారు. లెక్కలు హెచ్చుచేసి చూపించి మరింత ఆక్సిజన్ కావాలంటూ కొందరు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, టాంకర్లను ఢిల్లీకి మళ్లించడం కూడా తాను చూశానని అన్నారు. మరణాలను కూడా రాజకీయం చేయాలనుకున్నారని విమర్శించారు. ఆక్సిజన్ కొరతపై మూడుసార్లు రాష్ట్రాలను గణాంకాలు కోరడం జరిందన్నారు. పంజాబ్ నుంచి మాత్రమే ఆక్సిజన్ కొరతతో నాలుగు అనుమాస్పదన మరణాలు సంభవించినట్టు రిపోర్ట్ వచ్చిందని, ఆయా కేసులపై దర్యాప్తు జరుగుతోందని మంత్రి చెప్పారు. ఆక్సిజన్ కొరతతో మరణాలేవీ సంభవించ లేదంటూ 18 రాష్ట్రాలు తమకు నివేదించినట్టు కేరళ ఎంపీ అదూర్ ప్రకాష్ అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా మన్సుక్ మాండవీయ చెప్పారు.



## బూస్టర్ అనివార్యం కావచ్చు: రాహుల్

న్యూఢిల్లీ: వ్యాక్సిన్ స్ట్రాటజీపై కేంద్రం చాలా స్పష్టమైన ఆలోచన చేయాలని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. శుక్రవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, కొత్తగా వస్తున్న వేరియంట్లపై ప్రస్తుతం ఉన్న వ్యాక్సీన్లు సమర్థవంతంగా పనిచేయలేకపోవచ్చని తాను విన్నానని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పూర్తిగా వ్యాక్సినేషన్ వేయించుకునేలా దృష్టి సారించడం, కొత్త బూస్టర్‌తో అందరికీ మరోసారి వ్యాక్సినేషన్ ఇవ్వాలనే వాస్తవాన్ని అంగీకరించేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్రానికి ఆయన సూచించారు. కరోనా కొత్త వేరియంట్ ఒమైక్రాన్ ప్రపంచ దేశాలను వణికిస్తుండటం, దాదాపు 30 దేశాల్లో ఇప్పటికే ప్రభావం చూపిస్తోందన్న వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





# తుఫానుగా వాయుగుండం

(మొదటి పేజీ తరువాయి)

2రోజుల పాటు ఉత్తరాంధ్రలో పలుచోట్ల మోస్తారు వర్షాలు, అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి తీరం వెంబడి గంటకు 45-65 కిలోమీటర్లు, శనివారం 70-90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. మత్స్యకారులు సోమవారం వరకు వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

తుపాను కారణంగా 95 రైళ్లు రద్దు

గురు, శుక్ర, శనివారాల్లో 95 రైళ్లను నిలిపివేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ కార్యాలయం స్పష్టం చేసింది. ఇందులో విజయవాడ మీదుగా ప్రయాణించే 41 ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నాయి.

ముందు జాగ్రత్త చర్యలు తీసుకోండి:తుపాను నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లకు సీఎం ఆదేశం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర మూడు జిల్లాల కలెక్టర్లను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. ఉత్తరాంధ్రకు తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గురువారం ఉదయం ఆయన వైఎస్సార్ జిల్లా పర్యటనకు వెళ్లే ముందు ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, సీఎంవో కార్యాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవసరమైన చోట్ల సహాయ శిబిరాలు తెరిచేందుకు అన్ని రకాలుగా ఏర్పాట్లు చేసుకోవాలని నిర్దేశించారు. లోతట్టు, ముంపు ప్రాంతాలు ఉంటే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాన్ వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితుల వల్ల ఏ ఒక్కరూ ఇబ్బంది పడకుండా చూడాలని చెప్పారు. ఉత్తరాంధ్రలో తుపాను సహాయ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే బాధ్యతను ముగ్గురు సీనియర్ అధికారులకు అప్పగించారు. శ్రీకాకుళం జిల్లాకు హెచ్.అరుణ్‌కుమార్, విజయనగరం జిల్లాకు కాంతిలాల్‌దండే, విశాఖ జిల్లాకు శ్యామలరావును నియమించారు. వెంటనే ఆయా జిల్లాలకు చేరుకుని తుపాను సహాయ కార్యక్రమాల సమన్వయ, పర్యవేక్షణ బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

**విద్యుత్ ప్రమాదాలు, అవాంతరాలు జరిగితే సమాచారం ఇవ్వండి**

ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడింది. విశాఖపట్నానికి 960 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉన్న ఈ వాయుగుండం మరింత బలపడి శుక్రవారం మధ్య బంగాఖాళాతంలో జవాద్ తుపానుగా మారుతుందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఈపీడీసీఎల్) విద్యుత్ వినియోగదారులకు అప్రమత్తం చేసింది. జవాద్ తుఫాన్ వల్ల ఏర్పడే విద్యుత్ ప్రమాదాలు, అవాంతరాలకు సంబందించిన సమాచారాన్ని ఏపిఈపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నంబర్లకు తెలియజేయాలని పేర్కొంది.

తుఫాన్ ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్లకొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపింది. వాటి సమాచారాన్ని టోల్ ఫ్రీ నెం. 1912, కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని ఏఎండీ కె.సంతోషరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కంట్రోలు రూమ్ ఫోన్ నెంబర్లు..

విశాఖపట్నం కార్పొరేట్ ఆఫీసు- 9440816373 / 8331018762

శ్రీకాకుళం- 9490612633

విజయనగరం-9490610102

విశాఖపట్నం-7382299975

తూర్పుగోదావరి-7382299960

పశ్చిమగోదావరి-9440902926

# దరఖాస్తు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నామని ఆ పనులకు శంకుస్థాపన తానే చేస్తానని చెప్పారు. కొట్టుకుపోయిన సోమశిల డ్యామ్ అప్రాన్ నిర్మాణం కోసం రూ. 120కోట్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. వరద సహాయం అందని వారు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వరదల్లో బాధితులను ఆదుకోవడంలో జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, నగర కమినర్ దినేష్ పని తీరును ప్రశంసించారు. భగత్‌సింగ్ నగర్ కాలనీలో కోతకు గురైన పెన్నా నదిని సీఎం జగన్ పరిశీలించారు. వరద బాధితులను పరామర్శించిన సీఎం జగన్ బాధితులకు భరోసా ఇచ్చారు. పెనుబల్లిలో దెబ్బతిన్న రోడ్లు, పాఠశాల, పంట పొలాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిజొన్నవాడ వద్ద తెగిపోయిన పెన్నా నది పొర్లు కట్టని సీఎం జగన్ పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

**కోతకు గురైన కరట్టను పరిశీలించిన సీఎం జగన్..**

నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు చేరుకున్న సీఎం.. అక్కడ నుంచి రోడ్డు మార్గాన నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాలెనికి వెళ్లి వరదలు కారణంగా దెబ్బతిన్న రహదారులు, పంటలు, కోతకు గురైన కరట్టను పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరద నష్టంపై ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వరద నష్టాన్ని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రజాప్రతినిధుల నుంచి వినతి ప్రతాలను సీఎం స్వీకరించారు. వరద బీభత్సంపై ప్రజా ప్రతినిధులను సీఎం అడిగి తెలుసుకున్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర హెూంమంత్రి సుచరిత



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 3:విజయవాడ రూరల్ మండలం ఎనికెపాడు లో పి. రెన్ వారు నిర్వహించిన సెమి క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర హెూంమంత్రి మేకతోటిసుచరీత స్థానిక శాసనసభ్యులు వల్లభనేని వంశీ పాల్గొన్నారు హెూంమ్ మంత్రి సుచరిత మాట్లాడుతూ. దేవుడు అంటే నమ్మకం ఉండాలి అది ఏవరు అయినా ఏ దేవుడు అయినా నమ్మకం తో ఉండాలి అని అన్నారు.నాకు ఈ సెమి క్రిస్టమస్ కార్యక్రమంలో పాల్గొనటం చాలా ఆనందం గా ఉందని అన్నారు.రాజకీయ పరంగా కాకుండా దేవుని సేవలో ఇలాంటి కార్యక్రమలు లో పాల్గొనటం మనస్సు కి చాల సంతోషం కలుగుతుంది అని అన్నారు.అనంతరం సుచరీత చేతులూ మీదుగా సెమి క్రిస్టమస్ కేక్ కట్ చేశారు

## ఓటిఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చందోలు (పిట్టలవానిపాలెం) ప్రజా పాలన : ఓటిఎస్ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చందోలు సర్పంచ్ గౌరీ దేవి విజయ కుమారి మునిర్ అన్నారు. మండలంలోని చందోలు పంచాయతీ కీ చెందిన ఇద్దరు లబ్ధిదారులు ఓటిఎస్ పథకం ద్వారా రుణాన్ని చెల్లించినందున శుక్రవారం చందోలు సచివాలయం-2 లో వారికి చలానా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ హౌసింగ్ కార్పోరేషన్ ద్వారా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు ఓటిఎస్ పథకం ద్వారా రుణాలు చెల్లించి గృహాలను క్రమబద్ధీకరించుకోవాలని చెప్పారు.ఓటీఎస్ ద్వారా రూ.10 వేలు చెల్లించి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పత్రం పొందాలన్నారు.తద్వారా లబ్ధి దారులు బ్యాంకులో రుణాలు పొందడంతో పాటు ఇతరులకు అమ్ముకునే వెసులబాటు ఉంటుందన్నారు.ఓటిఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరేంద్రబాబు, వి ఆర్ వో అమానుల్లా, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## రబీకి సాగునీటి ఏర్పాట్లపై ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సమీక్ష



భీమవరం, డిసెంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : రబీకి సాగునీరు, ముందస్తు నాట్లకు రైతులను సమాయత్తం చేయడం, కాలువలలో తూడు, సిల్ట్, చెత్త తొలగింపు తదితర అంశాలపై గురువారం సబ్ కలెక్టర్ విష్ణుచరణ్ శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాసుతో కలిసి స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ రబీకి సాగునీరు అందించేందుకు జిల్లా నీటిపారుదల సలహామండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగిందని దీనిలోభాగంగా ఈనెల15వ తేదీ నుండి కాలువలకు సాగునీరు విడుదలచేసి ఏప్రిల్ 15వ తేదీన నిలుపుదల చేయడం జరుగుతుందని అన్నారు. దీనిపై ఇరిగేషన్,రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు ముందస్తు నాట్లపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంటియు 1121 వరి వంగడం 130 రోజుల్లోనే కోతకు వస్తుందని దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు జనవరి మొదటి వారంలోపు నాట్లు పూర్తిచేస్తే మంచి దిగుబడి సాధించడంతోపాటు పంట నష్టాలనుండి బయటపడవచ్చని అన్నారు. కరోనా కష్టకాల సమయంలో డెల్టా ఆధునీకరణ పనులు ఆలస్యం కావడంతో ప్రధాన కాలువలలో సిల్ట్, తూడు, చెత్త పేరుకుపోవడం, షట్టర్లు దెబ్బతినటం తదితర కారణాలతో కాలువ చివరి భూములకు నీరు అందించడంలో కొంత ఇబ్బంది కలిగిందన్నారు. డెల్టా ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ సి విష్ణుచరణ్ మాట్లాడుతూ, రైతులకు రబీ సాగు నీరందించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. ముందస్తు నాట్లపై రైతులకు అవగాహన కల్పించి సమాయత్తం చేయాలని తక్షణమే చేపట్టవలసిన పనులు, అనంతరం పనులపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సబ్ కలెక్టర్ సి విష్ణు చరణ్ అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్లు, అగ్రికల్చర్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## విశ్వంభర చే దుప్పట్లు, ఆహారం పంపిణీ



కావలి, డిసెంబర్3ప్రజాపాలన ప్రతినిధి :విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వరద బాధితులకు ఆహార పంపిణీ చేశారు. కావలి చెరువు సమీపంలో వరద నీరు చేరిన శివరామసుబ్బయ్య కాలనీ లో ని బాధితుల ను ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి సువర్ణ కుమారి కమిటీ సభ్యులతొ కలిసి పరామర్శించారు. వర్షాలతో కలిగే సీజనల్ వ్యాధులు నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అవసరమైన ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆహారం, చలినుంచి కాపాడుకునేందుకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ తరపున ఉచిత వైద్య శిబిరం నిర్వహించి తమ అండదండలు అందిస్తామని సువర్ణ తెలిపారు.కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జయప్రతాప్ రెడ్డి, రమణయ్య, ప్రభావతి, ఆయుర్వేద వైద్యులు టి.శ్రీనివాసులు శ్రీ సాయి ట్రస్టు పొన్నగంటి మాధవి పాల్గొన్నారు.

## ప్రజల నమ్మకంతో ఫిన్‌టెక్ విప్లవం: మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ) నిర్వహించిన ఇన్ఫినిటీ ఫోరం కార్యక్రమంలో వర్చువల్ విధానంలో శుక్రవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆదాయం వృద్ధి చెందితే, పెట్టుబడులు పెట్టడం సాధ్యమవుతుందని, బీమా కవరేజి వల్ల రిస్క్ తీసుకునే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్ వల్ల విస్తరణలకు రెక్కలు వస్తాయన్నారు. ఈ నాలుగు స్తంభాలపై భారత దేశం పని చేస్తోందన్నారు. ఫిన్‌టెక్ విజయానికి ఆధారం దాని సమ్మిళితత్వం, ఉమ్మడి శ్రేయస్సేనని తెలిపారు. విస్తృత వేదిక ఫిన్‌టెక్ ఇన్నోవేషన్స్‌కు కచ్చితమైన స్ప్రింగ్‌బోర్డు అవుతుందని చెప్పారు. భారత దేశంలోని ఫిన్‌టెక్ ఇండస్ట్రీ దేశంలోని ప్రతి వ్యక్తికీ చేరువయ్యేందుకు వినూత్న అవకాశాలను కనుగొంటున్నట్లు తెలిపారు. ఫిన్‌టెక్ చొరవను ఫిన్‌టెక్ విప్లవంగా మార్చవలసిన సమయం ఆసన్నమైందన్నారు. దేశంలోని ప్రతి వ్యక్తి ఆర్థిక సాధికారతను సాధించడానికి దోహదపడే విధంగా ఈ విప్లవం ఉండాలన్నారు. తన ప్రభుత్వం ఫిన్‌టెక్ ద్వారా ప్రజలను సాధికారులను చేసేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. గడచిన ఏడేళ్ళలో దాదాపు 430 మిలియన్ల జన్ ధన్ ఖాతాలతో బ్యాంకింగ్ వ్యవస్థ సార్వజనీనమైందన్నారు. ఇప్పటి వరకు 690 మిలియన్ల రూపే కార్డులు జారీ అయ్యాయని, గత ఏడాది వీటి ద్వారా 1.3 బిలియన్ల లావాదేవీలు జరిగాయని తెలిపారు. దేశీయంగా అభివృద్ధిపరచిన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) గత నెలలో 4.2 బిలియన్ల లావాదేవీలను ప్రాసెస్ చేసిందని చెప్పారు. జీవితం సుఖమయమయ్యే విధంగా వేగంగా డిజిటల్ గవర్నెన్స్‌ను అమలుచేస్తున్నామన్నారు. ప్రతి నెలా జీఎస్‌టీ పోర్టల్‌లో దాదాపు 300 మిలియన్ల ఇన్వాయిస్‌లు అప్‌లోడ్ అవుతున్నట్లు తెలిపారు.

## పునీత శౌరి వారి మహెూత్సవ కార్యక్రమం



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 3:గన్నవరం మండలం అజ్జంపూడి గ్రామంలో సునీత శౌరి వారి మహెూత్సవం దివ్య సమిష్టి బలి పూజ కార్యక్రమం లో రైట్ రెవరెండ్ బిషప్ తెలుగు తోటి రాజారావు గారు విచారణ గురువులు. బలుగురి రాజు. రమేష్. సహాయకులు పాల్గొన్నారు అచ్చం పూడి చుట్టుపక్కల గ్రామాల క్రైస్తవులు తరలి వచ్చి ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు

## ఎన్నికల వ్యూహకర్త, రాజకీయ వ్యాపారి నోరు అదుపులో పెట్టుకోవాలి

**ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్**

విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ విమర్శించడంపై ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు ఏంటో ప్రశాంత్ కిషోర్ కి తెలుసా అని ప్రశ్నించారు. ఏ పార్టీ డబ్బులు ఇస్తే ఆ పార్టీకి అనుకూలంగా సర్వేలు చేసి ఇచ్చే బ్రోకర్లు కూడా కాంగ్రెస్ పార్టీ ని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. రాజకీయాలు ఎలా ఉండాలో ప్రశాంత్ కిశోర్ చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాజకీయం అంటే ఎన్నికల్లో గెలవడమే కాదు, రాజకీయాన్ని వ్యాపారం చేసే వాళ్లకు ఎలా తెలుస్తుంది? అని శైలజానాథ్ విమర్శించారు. సిద్ధాంతాల పట్ల ఎలాంటి నిబద్ధత లేకుండా రాజకీయమే వ్యాపార వృత్తిగా గల ఓ వ్యక్తి ఎన్నికల్లో పోటీ చేసే విషయాలపై ఎవరికైనా సలహాలు ఇచ్చుకోవచ్చు, కానీ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు ఎలా ఉండాలో ఆయన నిర్ణయించలేరు. ఆర్ఎస్ఎస్ నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు రాహుల్‌గాంధీ 'దైవిక కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు" అని శైలజానాథ్ అన్నారు.

## అప్పులు బాధ తాళలేక రైతు ఆత్మహత్య యత్నం



కొత్తపేట,(ప్రజాపాలన ప్రతినిధి) తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట మండల పరిధిలోని మందపల్లి గ్రామానికి చెందిన రైతు మాడాల రామ సత్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మందపల్లి గ్రామం లో నాలుగు ఎకరాల వరి సాగు కౌలుకు చేస్తుండగా ప్రస్తుతం వాతావరణం అనుకూలించకపోవడంతో వరి సాగు పూర్తిగా నేలమట్టం అయిపోయింది, దీంతో సాగుకు పెట్టిన పెట్టుబడి కౌలుశిత్తు కూడా దక్కకపోవడంతో శుక్రవారం రైతు మాడాల రామ సత్యం పంట పొలంలో పురుగుల మందు సేవించాడు, దీంతో విషయం గమనించిన పక్క రైతులు వెంటనే కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, రామ సత్యం నివసించే ఇల్లు కూడా అద్దెకి కావడంతో రైతు జీవితంపై విరక్తి చెంది ఈ ఘాతుకానికి పాల్పడ్డారని గ్రామస్తులు తెలిపారు రైతుకు ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి ఉన్నట్లు స్థానికులు తెలిపారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం




గన్నవరం ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 3:బాపులపాడు మండలం వీరవల్లీ ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అవరణలో వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పిల్లా అనిత , సొసైటీ బ్యాంకు అధ్యక్షరాలు అల్లాడి థెరిస్సా లు రైతులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. సాధరణ రకం క్వింటాలకు 1940 రూపాయలు 75 కిలోల 1450 రూపాయలు , గ్రేడ్ - ఏ రకం 1960 రూపాయలు , 75 కిలోల ధ్యానం 1470 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. తేమ శాతం 17 లోపు ఉండాలన్నారు. వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా రైతులు ధాన్యాన్ని పొలాల్లో ఉంచకుండా కొనుగోలు కేంద్రం కి తరలించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రేయించి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు కొనుగోలు కేంద్రాలు ద్వారా ధాన్యం విక్రేయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ అధ్యక్షరాలు అల్లాడి థెరిసా , సొసైటీ డైరెక్టర్ గూడవల్లి రత్నసుధాకార్ ,కోడేబోయన బాబీ , పాలకవర్గ సభ్యులు పిల్లా రామారావు , ఉప సర్పంచ్ లంక అజేయ్ , ఎంపిటిసిలు దూసరి నిర్మల , అమృతపల్లి సూర్యనారాయణ , లంక సురేంద్ర మోహన బెనర్జీ , గుండపనేని ఉమావరప్రసాద్ , అత్మూరి బాలాజీ , రంగన్నగూడెం పిఏసిఎస్ అధ్యక్షుడు కసుకుర్తి శ్రీనివాసరావు , అర్ బికే వ్యవసాయ అధికారి లలితా ,వీరవల్లీ పిఏసిఎస్ సీఈవో ప్రకాశరావు, క్యాషియర్ ఏసుబాబు, గండి చిన్నారావు , వేణుగోపాలరావు , మోర్ల అంజనేయలు , రాయి ప్రభుకుమార్ , శిలువరాజు ,కాళీదాసు , లంక అనంద్ , దూసరి సుధీర్ కుమార్ ,అమృతనల్లి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రిప్టో కరెన్సీ వలన ఆర్థిక రంగాన్ని అస్తవ్యస్థంచేస్తుందా ?

## భారత ఆర్థిక రంగాన్ని అతలాకుతలం చేయనున్న క్రిప్టో కరెన్సీ

**డాక్టర్. ఎం. సురేష్ బాబు, రాష్ట్ర అధ్యక్షులు, ప్రజా సైన్సు వేదిక**





రూపాయి, డాలర్ లేదా మరేదైనా కరెన్సీ లాగాక్రిప్టోకరెన్సీఉంటుంది. అయితే, ఇది డిజిటల్ మాత్రమే. అంటే, మీరు దానిని నోటు లేదా నాణెం లాగా జేబులో ఉంచుకోలేరు. ఎందుకంటే ఈ మొత్తం కరెన్సీ క్రిప్టోగ్రఫీ సూత్రం ఆధారంగా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీతో తయారు అయింది. అందుకే దీనిని క్రిప్టోకరెన్సీ అంటారు.

ప్రైవేట్ క్రిప్టోకరెన్సీ అంటే ఏమిటి?

ప్రైవేట్ క్రిప్టోకరెన్సీ అనేది లావాదేవీ సమాచారం పబ్లిక్‌గా లేని కరెన్సీ. అంటే, ఆ కరెన్సీతో ఏమి జరుగుతోంది అనే నేపథ్యాన్ని తనిఖీ ఎవరూ చేయలేరు. పబ్లిక్ క్రిప్టోకరెన్సీ అంటే లావాదేవీ సమాచారం పబ్లిక్‌గా అందుబాటులో ఉంటుంది. దీని కారణంగా, వాటి నేపథ్యం తనిఖీ చేయవచ్చు. ఇది మరింత నమ్మదగినది. అయితే ప్రభుత్వం తీసుకురానున్న బిల్లులో ప్రైవేట్ క్రిప్టోకరెన్సీలను ఎలా నిర్వచించనున్నారనేది కూడా అర్థం చేసుకోవాల్సిందే. ప్రభుత్వం కోరుకుంటే, అన్ని రకాల క్రిప్టోకరెన్సీలకు ప్రైవేట్ హోదా ఇవ్వవచ్చు.

బ్లాక్ చైన్ :బ్లాక్‌చైన్ఒక సైబర్ భద్రతా వ్యవస్థ. ఇందులో డేటా తస్కరించుటకు హ్యాకర్లకు అవకాశం ఉండదు.ఒక విలువైన, రహస్యమైన సమాచారాన్ని వివిధ ప్రాంతాలలో భద్రపరిచి దాన్ని ఇతరులు తస్కరించకుండా ఒకదానితో మరొకటి అనుసంధానించి దానికిసాంకేతిక భద్రత కల్పించమే ఈ బ్లాక్‌చైన్ టెక్నాలజీ. ఈ విధానంలో డేటాను నింపేవారికి ఒక రహస్య పాస్‌వర్డ్ అందిస్తారు. వారు కూడా క్షణాల్లో దీనిలోకి ప్రవేశించి సమాచారాన్ని నవెూదు చేయాల్సి ఉంటుంది. నెట్‌వర్క్‌లోకి పాస్‌వర్డ్ కలిగిన వారు మాత్రమే ప్రవేశించడానికి అవకాశం ఉంటుంది. వీరు తప్ప మరొకరు ప్రవేశించడానికి ప్రయత్నిస్తే మిగిలిన వారికి ఈ సమాచారం క్షణాల్లో తెలిసిపోవడంతో అప్రమత్తమవుతారు. ఈ విధంగా ఇది అత్యంత భద్రమైంది. ఇందులో డేటాను భద్రపరిచే ప్రాంతాలను నోడ్స్ అని.. పాస్‌వర్డ్‌ను హాష్‌కీ పిలుస్తారు. డేటాను క్రిప్టాలజీ విధానం ద్వారా కోడ్స్‌లోకి మార్చి భద్రపరుస్తారు. డేటాను చోరీ చేయాలనుకునే వారు ఒకేసారి భద్రపరిచిన నోడ్స్ అన్నింటిపైన ఏకకాలంలో ఒకేసారి దాడిచేసి డేటాను తీసుకోవాల్సి ఉంటుంది. బిల్లులో క్రిప్టోకు సంబంధించి ఏమి సాధ్యమవుతుందో తెలుసుకుందాం..

భారతీయ రిజర్వ్ బ్యాంక్ కొత్త డిజిటల్ కరెన్సీని జారీ చేయవచ్చు. ఇది ప్రభుత్వం లేదా పబ్లిక్ క్రిప్టోకరెన్సీ అవుతుంది.ప్రభుత్వం ప్రైవేట్,పబ్లిక్ క్రిప్టోకరెన్సీలను వేరు చేయడం ద్వారా ప్రైవేట్‌ను పూర్తిగా నిషేధించాలి. ప్రజల కోసం కొన్ని నియమాలు.. మరియు నిబంధనలను తీసుకురావాలి. ఏది ఏమైనప్పటికీ, మార్కెట్లో అంతగా ప్రైవేట్ క్రిప్టోకరెన్సీలు లేవు. దీని కారణంగా మార్కెట్ పెద్దగా ప్రభావితం కాదు.ప్రభుత్వం క్రిప్టోను నియంత్రించవచ్చు. చాలా సాధారణ నిబంధనలను తీసుకురావడం ద్వారా దానిపై పన్నులు విధించవచ్చు. లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ లేదా మీరు ఎంత క్రిప్టో కొనుగోలు/అమ్ముతున్నారు అనే దానిపై పన్ను విధించవచ్చు. ప్రభుత్వం తన సొంత వాలెట్‌తో రావచ్చు. ఆర్బీఐ ఈ వాలెట్‌ని జారీ చేస్తుంది. దీని ద్వారా మీరు క్రిప్టోకరెన్సీల లావాదేవీలు జరుపవచ్చు. దీనితో, క్రిప్టోకరెన్సీకి సంబంధించిన అన్ని లావాదేవీల రికార్డులు నిర్వహిస్తారు. దీనివల్ల ప్రభుత్వంపై క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారుల విశ్వాసం కూడా పెరుగుతుంది.

క్రిప్టోకరెన్సీలను ప్రభుత్వం పూర్తిగా నిషేధించలేదా?

ఏ ప్రభుత్వానికైనా నియంత్రణ చేయగలిగే అవకాశం తన దేశానికే పరిమితం. అయితే, ఇంటర్నెట్ ప్రపంచానికి హద్దులు లేవు. ఇంటర్నెట్‌లో ఏ సర్వర్‌లో ఎవరు ఏమి చేస్తున్నారో ఎవరికీ తెలియదు. అలాగే, క్రిప్టో ఎన్‌క్రిప్టెడ్ రూపంలో ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీనికి చాలా విలువ ఉంది. అందుకే ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిషేధించలేదు. ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ప్రజలు వివిధ మార్గాల్లో వ్యాపారం చేయవచ్చు. క్రిప్టో ప్రత్యేకత ఏమిటంటే, ప్రభుత్వం లేదా బ్యాంకు లేదా ఏ ఒక్క వ్యక్తి దానిపై నియంత్రణ కలిగి ఉండరు.అలాగే, ఇలాంటి క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజీలు చాలా ఉన్నాయి. అవి భారతదేశంలో కూడా నమోదు కావు. భారత ప్రభుత్వం చట్టం చేసినా, వాటి వల్ల పెద్దగా తేడా ఉండకపోవచ్చు.

క్రిప్టోకరెన్సీని ఎలా సృష్టిస్తారు?

మైనింగ్ ద్వారా క్రిప్టోకరెన్సీలు సృష్టించబడతాయి. ఇది వర్చువల్ మైనింగ్. దీనిలో క్రిప్టోకరెన్సీని పొందడానికి చాలా క్లిష్టమైన డిజిటల్ పజిల్‌ను పరిష్కరించాలి. ఈ పజిల్‌ని పరిష్కరించడానికి మీ స్వంత అల్గారిథమ్ (ప్రోగ్రామింగ్ కోడ్) అలాగే చాలా కంప్యూటింగ్ పవర్ అవసరం. కాబట్టి సిద్ధాంతంలో ఎవరైనా క్రిప్టోకరెన్సీని తయారు చేయవచ్చని చెప్పవచ్చు. కానీ, ఆచరణలో దీన్ని తయారు చేయడం చాలా కష్టం.భారతీయ మదుపర్లు, గత సంవత్సరంతో పోల్చితే, ఈ ఏడాది క్రిప్టో పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి.బిట్‌కాయిన్ ధర అనూహ్యంగా పెరిగింది. డిజిటల్ టోకెన్లు మిశ్రమ ధోరణిని అవలంబిస్తున్నాయి. మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రకారం ప్రపంచంలోని అతిపెద్ద క్రిప్టోకరెన్సీ ఒక శాతం కంటే ఎక్కువ జంప్‌తో %వి%62,112 వద్ద ట్రేడవుతోంది. ఏదేమైనా, క్రిప్టో సాధించిన అత్యధిక రికార్డు స్థాయి నుండి పడిపోయింది. ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం మొదటి %ఖూ% బిట్‌కాయిన్ ఫ్యూచర్స్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ ప్రారంభించడం.బిట్‌కాయిన్ అత్యధిక లాభాలతో %వి% 66,974 రికార్డు స్థాయికి చేరుకుంది.దీనికి ఆరు నెలల ముందు, ఇది రికార్డు గరిష్ట స్థాయి %వి% 64,895 సాధించింది.ఈ ర్యాలీని ప్రోషేర్స్ బిట్‌కాయిన్ స్ట్రాటజీ ఇటిఎఫ్ నడిపించింది.ఫండ్ సహాయంతో, పెట్టుబడిదారులు బిట్‌కాయిన్ యొక్క భవిష్యత్తు విలువపై అంచనాలు చేయవచ్చు. దీని కోసం కొనుగోలు చేయవలసిన అవసరం లేదు.క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు అంటూ ఒకవైపు ఆర్‌బీఐ ఆందోళనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, నియంత్రణలపరమైన అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. మరోవైపు క్రిప్టో మార్కెట్ దేశంలో శరవేగంగా విస్తరిస్తోంది. 2021లోనే ఇప్పటి వరకు 100 స్టార్టప్‌లు క్రిప్టోలకు సంబంధించి ఏర్పాటయ్యాయంటే ఈ మార్కెట్ ధోరణులు ఎలా ఉందీ అర్థం చేసుకోవచ్చు. దేశంలో క్రిప్టో స్టార్టప్‌ల సంఖ్య 400కు చేరుకుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

క్రిప్టోలకు సంబంధించి పలు రకాల సేవలను ఈ స్టార్టప్‌లు ఆఫర్ చేస్తున్నాయి. ప్రస్తుతానికి క్రిప్టో స్టార్టప్‌లు 380 వరకు ఉండగా.. నాన్ ఫంగిబుల్ టోకెన్ (ఎన్‌ఎఫ్‌టీ) ఆధారిత స్టార్టప్‌లు మరో 12 వరకు ఉన్నాయని సమాచారం. "కొత్త కాయిన్ల ఏర్పాటుపై ఎన్నో స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. కొన్ని స్టార్టప్‌లు క్రిప్టోలకు సంబంధించి ఇన్వెస్టర్ల కమ్యూనిటీలను ఏర్పాటు చేస్తున్నాయి. వీటి కార్యకలాపాలు ఈ ఏడాది మరింత బలోపేతమయ్యాయి. ఈ ఏడాది ఇప్పటికే సుమారు 100 వరకు స్టార్టప్‌లు కొత్తగా ఏర్పాటు కాగా, 2020లోనూ 50-60 స్టార్టప్‌లు మొదలయ్యాయి .

క్రిప్టోకరెన్సీలను ఎందుకు ప్రమాదకరంగా పరిగణిస్తారు?


మీరు రూపాయి, డాలర్, యెన్ లేదా పౌండ్ గురించి మాట్లాడేటప్పుడు, దానిని జారీ చేసిన దేశంలోని సెంట్రల్ బ్యాంక్ ద్వారా అది నియంత్రణలో ఉంటుంది. ఈ కరెన్సీ ఎంత, ఎప్పుడు ముద్రించాలనేది దేశ ఆర్థిక పరిస్థితిని చూసి నిర్ణయిస్తారు. కానీ క్రిప్టోకరెన్సీలపై ఎవరికీ నియంత్రణ లేదు ఉండదు. ఇది పూర్తిగా వికేంద్రీకృత వ్యవస్థ. దీన్ని ఏ ప్రభుత్వమూ లేదా కంపెనీ నియంత్రించలేవు. ఈ కారణంగా ఇది ప్రమాదకరం కూడా.భారత్‌లో క్రిప్టోకరెన్సీల భవిష్యత్తుపై ఆర్థిక శాఖ మాజీ సహాయ మంత్రి జయంత్ సిన్హా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ సమావేశం అయ్యింది. ఎక్స్ఛేంజీలు, బ్లాక్ చైన్, క్రిప్టో అసెట్స్ కౌన్సిల్ , పరిశ్రమ సంస్థలు, ఇతర వాటాదారులతో సోమవారం ఒక ముఖ్యమైన సమావేశాన్ని నిర్వహించింది కమిటీ. ఈరోజు జరిగిన సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇందులో క్రిప్టోకరెన్సీపై పెట్టుబడులను ఆపలేమని, అయితే దానిని ఖచ్చితంగా నియంత్రించవచ్చని మాత్రం కమిటీ సభ్యులు అంగీకరించినినట్లుగా తెలుస్తోంది. క్రిప్టోకరెన్సీని పూర్తిగా నిషేధించడానికి చాలా మంది కమిటీ సభ్యులు అనుకూలంగా లేరని సమాచారం. వారు దాని మార్పిడి. నియంత్రణకు అనుకూలంగా ఉన్నారని,తద్వారా క్రిప్టో దుర్వినియోగం చేయబడకుండా చూడాలని కోరినట్లుగా తెలుస్తోంది. భద్రతపై కమిటీ సభ్యుల ఆందోళన.. సమావేశానికి హాజరైన ఎంపీలు (ఫైనాన్స్‌పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు) క్రిప్టోకరెన్సీలలో పెట్టుబడిదారుల డబ్బు భద్రతపై నొక్కిచెప్పారు. జాతీయ వార్తాపత్రికలలో ఫుల్ పేజ్ క్రిప్టో ప్రకటనపై సమావేశానికి హాజరైన సభ్యుడు ఆందోళన వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. క్రిప్టోకరెన్సీల్లో పెట్టుబడులు పెట్టడం ప్రజల హక్కు అని నిపుణులు కొందరు వాదించినట్లుగా తెలుస్తోంది. దేశంలోని ఏ వ్యక్తి అయినా తన ఇష్టపూర్వకంగా ఇందులో పెట్టుబడి పెట్టవచ్చని చెప్పడమే దాని అర్థం.

కమిటీ సభ్యులు ప్రభుత్వ అధికారుల నుంచి ఈ డిమాండ్ క్రిప్టోకరెన్సీలకు సంబంధించి ఈ సమావేశానికి హాజరైన ఆర్థిక పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, ఇప్పుడు ఈ మొత్తం విషయంలో ప్రభుత్వ అధికారులు ముందుకు వచ్చి తమ ఆందోళనలపై తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరుతున్నారు. క్రిప్టో ఫైనాన్స్ యొక్క పెట్టుబడి నష్టాలకు సంబంధించి వివిధ పార్టీల ఆసక్తి, ఆందోళనలు ఇటీవలి కాలంలో వేగంగా పెరిగాయని మీకు తెలియజేద్దాం. ఈ పార్లమెంటరీ కమిటీ ఐఐఎం లోని విద్యావేత్తల మరియు ఆర్థికరంగ, సైబర్ నిష్ణాతుల సూచనలను కూడా తీసుకుంటుంది.

# సైబర్ సెక్యూరిటీ పై అవగాహన పెంచుకోవాలి: జిల్లా ఎస్.పి - డా కే. పక్కీరప్ప

సైబర్ సెక్యూరిటీ మరియు సేఫ్టీ అంశం పై ఒక్కరోజు వర్క్‌షాప్ స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. సి డాక్ మరియు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా లో ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లుమరియు జిల్లా పోలిసు అధికారులకు అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎం. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ -టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ఇప్పుడిప్పుడే భారత్ పుంజుకుంటోంది. మెరుగైన మానవ వనరులు, సైబర్ సెక్యూరిటీ విషయంలో మన దేశం దూసుకెళ్తోంది. అయితే ఇతర దేశాలతో పోలిస్తే సైబర్ సామర్థ్యం విషయంలో మన దేశం వెనుకంజలోనే ఉందని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ స్టడీస్ అనే సంస్థ తేల్చింది. సైబర్ సామర్థ్యం విషయంలో భారత్ వ్యూహం కేవలం ప్రాథమిక స్థాయిలోనేఉంది. జిల్లా ఎస్పీ డా కే. ఫక్కీరప్ప మాట్లాడుతూ -ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కంప్యూటర్‌లను ఉపయోగించి సైబర్ నేరస్థులు బహుళ కంప్యూటర్‌లు లేదా నెట్‌వర్క్‌లకు వ్యతిరేకంగా దాడి చేయటాన్ని సైబర్ అటాక్ అంటాము. సైబర్ దాడి హానికరమైన రీతిలో కంప్యూటర్‌లను నిలిపివేయవచ్చు, డేటాను దొంగిలించవచ్చు లేదా ఇతర దాడులకు లాంచ్ పాయింట్‌గా ఉల్లంఘించిన కంప్యూటర్‌ను ఉపయోగించవచ్చు.మాల్వేర్, ఫిషింగ్, ర్యాన్సమ్వేర్ , డైనెల్ఆఫ్ సర్వీస్ (సేవ యొక్క తిరస్కరణ), ఇతర పద్ధతులతో సహా సైబర్ దాడిని ప్రారంభించడానికి సైబర్ నేరస్థులు వివిధ పద్ధతులను ఉపయోగిస్తారు.ప్రపంచం ఇప్పుడు 5వ తరం సైబర్-దాడిని ఎదుర్కొంటోంది - సైబర్ మహమ్మారి యొక్క స్పష్టమైన లక్షణాలతో కూడిన అధునాతనమైన, బహుళ-వెక్టార్ దాడి. డాక్టర్ ఎం. సురేష్ బాబు, మాట్లాడుతూ చాలకంపెనీలు మరియు ప్రభుత్వ కార్యాలయాలు తమ కంప్యూటర్‌లలో సాధారణ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌గా కనిపించిన వాటిని డౌన్‌లోడ్ చేస్తున్నాయి, కానీ వాస్తవానికి ఇది ట్రోజన్ హార్స్.సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌ల యొక్క సాధారణ ఐటీ అభ్యాసాన్ని ఉపయోగించడం ద్వారా, దాడి చేసేవారు సంస్థ యొక్క గోప్యత సమాచారాన్ని తస్కరించడం జరుగుతుందని తెలిపారు.ర్యాన్సమ్వేర్‌దాడుల వలన చిన్న స్థానిక మరియు ప్రభుత్వ సంస్థలు బాధితులయ్యాయి. క్లౌడ్ కంప్యూటింగ్, క్లౌడ్-ఆధారిత సబ్‌స్క్రిప్షన్ సేవలు మరియు మొబైల్ పరికరాల సర్వవ్యాప్తితో డిజిటల్ పరివర్తన సాంప్రదాయ నెట్‌వర్క్ పరిధులను నాశనం చేస్తోందన్నారు.సి డాక్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ఎం . జగదీష్ బాబు మాట్లాడుతూ మాల్వేర్ మొత్తం,ర్యాన్సమ్వేర్‌మరియు మొబైల్ మరియు క్లౌడ్ మాల్వేర్‌లలో గ్లోబల్ సైబర్ అటాక్ ట్రెండ్‌లను చెక్ పాయింట్ రీసెర్చ్ఈ సంవత్సరాంతంలో సైబర్ దాడుల పట్ల విశ్లేషణను అందిస్తుంది.షాడో హామర్‌దాడిలో, దాడి చేసేవారు అసూస్ లైవ్ అప్‌డేట్ యుటిలిటీలో హానికరమైన కోడ్‌ను అమర్చి, తద్వారా మిలియన్ల కొద్దీ రిమోట్ కంప్యూటర్‌లలో బ్యాక్‌డోర్‌లను ఇన్‌స్టాల్





చేయడానికి వారిని అనుమతించారు.ఫిషింగ్ అనేది ఒక ప్రసిద్ధ సైబర్ అటాక్ టెక్నిక్ మరియు సైబర్ భద్రతకు అతిపెద్ద బెదిరింపులలో ఒకటిగా కొనసాగుతోంది. అధునాతన సామాజికంగా రూపొందించబడిన ఎగవేత పద్ధతులు ఎక్కువ ఫ్రీక్వెన్సీతో ఇమెయిల్ భద్రతా పరిష్కారాలను దాటవేస్తున్నాయి.ఎవాసివ్ ఇమెయిల్ స్కామ్‌లలోఎన్‌కోడ్ చేసిన ఇమెయిల్‌లు, ఇమెయిల్ బాడీలో పొందుపరిచిన సందేశం యొక్క చిత్రాలు, అలాగే హెచ్టిఎంఎల్ క్యారెక్టర్ ఎంటిటీలతో సాదా వచన అక్షరాలను మిళితం చేసే సంక్లిష్టమైన అంతర్లీన కోడ్ ఉంటాయి.2018తో పోలిస్తే 50% కంటే ఎక్కువ పెరుగుదలతో బ్యాంకింగ్ మాల్వేర్ విజయవంతంగా మొబైల్ సైబర్ రంగంలోకి చొరబడింది. బ్యాంకుల మొబైల్ అప్లికేషన్‌ల పెరుగుతున్న వినియోగానికి సంబంధించి, బాధితుల బ్యాంక్ ఖాతాల నుండి చెల్లింపు డేటా, ఆధారాలు మరియు నిధులను దొంగిలించే సామర్థ్యం ఉన్న మాల్వేర్ ముప్పుగా మారింది.సైబర్ డిఫెన్స్‌కు కీలకం ఎండ్-టు-ఎండ్ సైబర్ సెక్యూరిటీ ఆర్కిటెక్చర్, ఇది బహుళస్థాయి మరియు అన్ని నెట్‌వర్క్‌లు, ఎండ్‌పాయింట్ మరియు మొబైల్ పరికరాలు మరియుక్లౌడ్‌లో విస్తరించి ఉంటుంది.సరైన ఆర్కిటెక్చర్‌తో, మీరు బహుళ భద్రతా లేయర్‌ల నిర్వహణను ఏకీకృతం చేయవచ్చు, పాలసీ ద్వారా నియంత్రించవచ్చు. కార్యక్రమంలో లయన్ డా విరూపాక్ష రెడ్డి, అనంతపూర్ఎలైట్చార్టర్ప్రెసిడెంట్ ఇంజినీర్సత్యనారాయణ, వేద ఇన్ఫ్రా ఎండి వైష్ణవ శ్రీనాథ్, ఐ టి నిపుణులు పెద్దరాజు నవీన్ కుమార్, బి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao
DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046
7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 04, డిసెంబరు 2021

## భోపాల్ దుర్ఘటన-పాఠాలు నేర్వని పాలకులు

అభివృద్ధి పేరుతో లాభాలే పరమావధిగా నడుస్తున్న పరిశ్రమల వల్ల పర్యావరణానికి, ప్రజలకు నష్టమని తెలిసి కూడా అటువంటి పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నడుపుతున్నా పట్టించుకునేవారే లేరు! దీనివల్ల భవిష్యత్‌లో మరిన్ని భోపాల్, ఎల్.జి. ఘటనలు పునరావృతం కాక తప్పదనిపిస్తోంది. దేశంలో అత్యంత విషాద ఘటనగా, అతి పెద్ద పారిశ్రామిక విపత్తుగా భోపాల్ గ్యాస్ దుర్ఘటన నిలిచింది. మధ్యప్రదేశ్ లోని భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) పురుగు మందుల ప్లాంట్‌లో గ్యాస్ దుర్ఘటన జరిగి (1984) నేటికి 37 ఏళ్ళు. సుమారు 8000 మందికి పైగా మృతి చెందగా 5 లక్షలకు పైగా జనాభా దీని ప్రభావానికి లోనయ్యారని ఒక అంచనా! భోపాల్ దుర్ఘటనకు యూనియన్ కార్బైడ్ యాజమాన్య నిర్లక్ష్యం, భద్రతా లోపాలే కారణమని అనేక నివేదికలు తేటతెల్లం చేశాయి. దేశంలో ఈ ఘటన అనంతరం జరిగిన వాటిలో 2020 మే 7న విశాఖపట్నం లోని ఎల్.జి పాలిమర్స్ గ్యాస్ లీక్ కూడా భోపాల్ ఘటనను తలపించింది. విశాఖ దుర్ఘటనలో 11 మంది మృతి చెందగా, దాదాపు వెయ్యి మందికి పైగా విష వాయువుల ప్రభావానికి లోనయ్యారు. సరళీకరణ విధానాల మూలంగా విదేశాల్లో నిషేధించిన అనేక విషపూరిత రసాయన, ఫార్మా కంపెనీలు మన దేశానికి రావడంతో ఏదో మూల భోపాల్ లేదా విశాఖ ఎల్.జి గ్యాస్ లీక్ లాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజల ప్రాణాలు పోతూనే ఉన్నాయి. ఇటీవల నవంబర్ 28న రాత్రి విశాఖపట్నం ఫార్మా సిటీలో విష వాయువులు విడుదల కావడంతో ముక్కుపచ్చలారని ఇద్దరు యువ కార్మికులు మృత్యువాతపడ్డారు. ఈ ఘటనలన్నీ ప్రభుత్వ అండదండలతో యాజమాన్యాల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయన్నది జగమెరిగిన సత్యం. కానీ వీటిని నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం కూడా ప్రభుత్వ చెప్పుచేతల్లోనే ఉండడం, అధికార పెద్దలు చెప్పినట్లు నడుచుకోవడంతో అమాయక ప్రజలు ఈ దారుణాలకు బలైపోతున్నారు. భోపాల్ దుర్ఘటన నుండి ప్రభుత్వాలు ఏ గుణపాఠాలు నేర్చుకోలేదనే చెప్పాలి. భోపాల్ గ్యాస్ దుర్ఘటనకు కారణమైన వారెన్ ఆండర్సన్‌ను శిక్షించడంలోను, బాధితులకు నష్టపరిహారం అందించడంలోను ప్రభుత్వాలు అనుసరించిన తీరు అంత్యంత దుర్మార్గంగా నడిచింది. నేటికీ భోపాల్ దుర్ఘటన బాధితులు జీవచ్ఛవాలుగానే బతుకుతున్నారు. అభివృద్ధి పేరుతో లాభాలే పరమావధిగా నడుస్తున్న పరిశ్రమల వల్ల పర్యావరణానికి, ప్రజలకు నష్టమని తెలిసి కూడా అటువంటి పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నారు. కనీస ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నడుపుతున్నా పట్టించుకునేవారే లేరు! పరిశ్రమల్లో ప్రమాణాలు కాపాడాల్సిన కాలుష్య నియంత్రణా బోర్డు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, ఫైర్ డిపార్డుమెంట్లు...ప్రభుత్వాలు చెప్పినట్లు, యాజమాన్యాలకు అనుకూలంగా అనుసరిస్తోన్న ఘటనలు అనేకం ఉన్నాయి. దీనివల్ల భవిష్యత్‌లో మరిన్ని భోపాల్, ఎల్.జి. ఘటనలు పునరావృతం కాక తప్పదనిపిస్తోంది. పర్యావరణ అసమతుల్యత కారణంగా ప్రకృతి విపత్తులు తలెత్తడం, వాతావరణ సమతుల్యత కొరవడడం వల్ల అనేక ప్రాంతాలు విలవిల్లాడడం చూస్తూనే ఉన్నాం. ఓజోన్ పొరకు జరుగుతున్న నష్టం భవిష్యత్తులో మరిన్ని విపత్తులకు దారితీస్తుందన్న పర్యావరణవేత్తల హెచ్చరికలు పెడచెవిన పెడుతున్నారు. తీర ప్రాంతాల్లో పరిశ్రమల నుండి వచ్చే విష వాయువులను సముద్రంలోకి వదలడంతో...మత్స్య సంపద, వాటిపై ఆధారపడుతున్న మత్స్యకారుల జీవితాలు దాదాపుగా నాశనమైపోయాయి. అందుకు బాధ్యత వహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అదుపు చేయకపోగా తీర ప్రాంతాన్ని ఒక డంపింగ్ యార్డుగా మార్చే పనిలో పడ్డాయి. పెట్రో కెమికల్ మరియు పెట్రో కారిడార్‌ల పేరుతో విదేశాల్లో నిషేధించిన కంపెనీలను, పర్యావరణానికి హాని చేసే కంపెనీలను నెలకొల్పేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. సిఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. విశాఖపట్నం సమీపంలోని పరవాడ వద్ద 'రాంకీ' డెవలపర్‌గా జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీని 2005లో నెలకొల్పారు. హైదరాబాద్ పఠాన్ చెరువులోని అనేక ఫార్మా కంపెనీలు, మరిన్ని దేశీయ విదేశీ ఫార్మా కంపెనీలు ఇక్కడికి చేరాయి. ప్రస్తుతం 85 ఫార్మా కంపెనీలు 2500 ఎకరాల విస్తీర్ణంలో ఫార్మా ఉత్పత్తులు చేస్తున్నాయి. ప్రతి ఏడాది నాలుగైదు కంపెనీల్లో ప్రమాదాలు జరగడం అనేక మంది మృత్యువాత పడడం, మరి కొంతమంది క్షతగాత్రులు కావడం జరుగుతోంది. గత ఐదేళ్లలో జరిగిన ప్రమాదాల్లో 32 మంది వరకు మరణించారు. 80 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వం, అధికారులు హడావుడి చేయడం, మృతులకు ఎంతో కొంత నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం తప్ప ఘటనపై సమగ్ర విచారణ జరపడం, వాటిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం, బాధ్యులను శిక్షించడం వంటివేవీ ఈ కాలంలో జరగలేదనే చెప్పాలి. గత ఏడాది ఇదే ఫార్మా సిటీ డెవలపర్‌గా ఉన్న 'రాంకీ' కి చెందిన విశాఖ సాల్వెంట్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మరణించారు. 500 మీటర్ల విస్తీర్ణంలో వుండాల్సిన గ్రీన్ బెల్ట్‌ను విస్మరించి కంపెనీలకు అమ్ముకున్నారు. చుట్టూ చెరువుల్లోకి వ్యర్థాలను వదులుతున్నారు. పక్కనే ఉన్న తాడి గ్రామాన్ని తరలించకపోవడంతో అక్కడి ప్రజలంతా రోగాలు, రొచ్చులతో కాలుష్య కోరల్లో చిక్కుకుని జీవనం సాగిస్తున్నారు. 'రాంకీ' సంస్థ యజమాని రాష్ట్ర అధికార పార్టీ రాజ్యసభ సభ్యుడిగా ఉండడంతో ఏం చేసినా చెల్లుతుందనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఫార్మా సిటీలో కాలుష్య నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను గాలికొదిలేశారు. లాభాలే పరమావధిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు యాజమాన్యాలకు ప్రభుత్వాలు దాసోహమైతే భవిష్యత్తులో మరిన్ని భోపాల్, ఎల్.జి. ఘటనలు పునరావృతం కాక తప్పదని పాలకులు తెలుసుకోవాలి. ఆ తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. లేదంటే కాలుష్య నియంత్రణపై, పర్యావరణ రక్షణకై ప్రజా ఉద్యమాలు మరిన్ని రాకతప్పవని గమనించాలి.

# మారిన వ్యూహం, మారని హృదయం!


అనూహ్య రీతుల్లో వ్యవహరించడం ఘటనాఘటన సమర్థులైన నాయకుల స్వతస్సిద్ధ లక్షణం. ముందేమి జరగనున్నదోనని నిరంతరం అంచనావేయడంలో ప్రత్యర్థులు తలమునకలయ్యేలా చేయడం ఒక చతుర చాణక్యం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటువంటి రాజకీయ చదరంగంలో ఆరితేరిన నేత అని మరి చెప్పాలా? పుణ్యాత్ముడు గురునానక్ జయంతి నాడు, వివాదాస్పద వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకుంటున్నట్టు నరేంద్ర మోదీ నాటకీయంగా ప్రకటించి పక్షం రోజులు గడిచిపోయాయి. సాగుచట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో గత పదిహేను నెలలుగా రైతులు దేశ రాజధాని శివార్లలో ఆందోళన చేస్తున్నా కించిత్ కూడా పట్టించుకోని ప్రధానమంత్రి ఎట్టకేలకు ఎందుకు వెనకడుగు వేశారు? ఏ ఒక్కరికీ స్పష్టత లేని, స్పష్టత రాని విషయమది. మోదీ చెప్పిన 'క్షమాపణ' రైతులకు గురుపూర్ణిమ 'కానుక' అని ఆయన మద్దతుదారులు ఘంటాపథంగా చెబుతున్నారు. అంతేకాదు, అది ఆయన విశాల హృదయానికి ఒక తార్కాణమని కూడా వారు అంటున్నారు. అయితే మోదీ రాజకీయాలను మొదటి నుంచీ సన్నిహితంగా గమనిస్తున్నవారు పశ్చాత్తాపం అనేది ఆయన వ్యక్తిత్వంలో కానవచ్చే గుణవిశేషం కాదని అభిప్రాయపడుతున్నారు. అవును, మోదీ లాంటి శక్తిమంతుడైన నాయకుడు మట్టిమనుషుల డిమాండ్‌కు దిగిరావడం ఆయన హృదయ పరివర్తన ఫలితం కాదుబీ ఆయన వ్యూహంలో మార్పును మాత్రమే అది సూచిస్తుంది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగానూ, ఇప్పుడు దేశ ప్రధానమంత్రిగానూ నరేంద్రమోదీ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు తక్కువేమీ కావు. ఇంచుమించు రెండు దశాబ్దాలుగా అధికారాన్ని చెలాయిస్తున్న నరేంద్ర మోదీ తన వివాదాస్పద, నిర్ణయాలు చర్యలకు కనీసం ఒక్కసారైనా బహిరంగంగా క్షమాపణలు చెప్పలేదు. క్షమాపణలు చెప్పడం కాదు కదా సంజాయిషీ ఇవ్వడమనేది నాయకత్వ బలహీనత అవుతుందని మోదీ విశ్వసిస్తారు. క్షమాపణలు చెప్పడమనేది ఆయన పురుషహంకృత వ్యక్తిత్వానికి పూర్తిగా విరుద్ధం. 2002 మతతత్వ అల్లర్లను అదుపు చేయడంలో వైఫల్యానికి, పెద్దనోట్ల రద్దుతో ప్రజలకు ఎదురయిన కష్టాలకు ఒకటే కారణం ఉంది. అది: విమర్శకుల ముందు ఒక బలహీన నేతగా కనిపించేందుకు మోదీలో పూర్తి విముఖత. ఇదే ఆయన బలం. సదా మహాబలుడుగా కన్పించాలన్నదే మోదీ అభిలాష. అయితే రైతుల ఉద్యమం రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో, మరీ ముఖ్యంగా కీలక ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ విజయావకాశాలను దెబ్బ తీయగలదనే వాస్తవాన్ని నరేంద్ర మోదీ గుర్తించారు. ఎన్నికలు మోదీకి ఒక ఆక్సిజన్ సిలిండర్ లాంటివి. అవి ఆయనకు ఒక టానిక్ (బలవర్ధక ఔషధం)బీ ఎక్కడ లేని




సత్తువను సమకూరుస్తాయి. ఒక సామాన్య కార్యకర్త (1980 దశకంలో అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా ఆయన రాత్రిపూట వాల్‌పోస్టర్లు అతికించారు)గా ఎంత ఉత్సాహంతో పని చేసారో, ఇప్పుడు ప్రధానమంత్రిగా వివిధ ఎన్నికలలో తమ పార్టీ అభ్యర్థుల విజయానికి అంతే ఉత్సాహంతో పని చేస్తున్నారు. 'ప్రచారాన్ని కవిత్వంలో నిర్వహించాలి, పరిపాలనను వచనంలా నిర్వహించాలన్న' అమెరికా రాజనీతిజ్ఞుడు మేరియో క్యూమో మాటలు మోదీకి పూర్తిగా వర్తిస్తాయి. ప్రచారం, పాలన మధ్య విభజన రేఖలను పూర్తిగా అస్పష్టపరచిన నాయకుడు మోదీ. పరిపాలకుడిగా ఆయన ప్రతి చర్య, రాబోయే ఎన్నికలకు సంవత్సరం పొడుగునా జరిగే ప్రచారంలో భాగమే. ఓటర్లను గరిష్ఠంగా ఆకట్టుకోవడానికి ఉద్దేశించినవే.వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు ముంచుకొస్తున్నందునే వివాదాస్పద సాగుచట్టాలను నరేంద్ర మోదీ ఉపసంహరించారు. వాటిని పూర్తిస్థాయిలో అమలుపరచడంలో తాను వ్యక్తిగతంగా విఫలమయ్యానని కూడా అంగీకరించారు. నిజానికి ఈ వైఫల్య బాధ్యతను తన కేబినెట్ సహచరులలో ఎవరో ఒకరి పైకి ఆయన సునాయాసంగా నెట్టివేయవచ్చు. కొవిడ్ రెండో విజృంభణను సకాలంలో అదుపుచేయడంలో కేంద్రప్రభుత్వ వైఫల్యానికి డాక్టర్ హర్షవర్ధన్‌ను బాధ్యుడ్ని చేయలేదూ? అలాగే రైతుల ఆందోళన విషయంలో కూడా వ్యవసాయ మంత్రి నరేంద్ర తొమార్‌ను బలిపశువు చేయవచ్చు. కానీ అలా జరగలేదు. ఈ వైఫల్యం తనదే అని మోదీ అంగీకరించారు. అయితే ఈ ఒప్పుకోలు ఆయన నాయకత్వ శైలిలో ఒక వ్యూహాత్మక మార్పును వెల్లడించింది. సంపూర్ణ అధికారాలను చెలాయించే సర్వోన్నత నాయకుడి స్థాయి నుంచి వినయశీలుడయిన ఒక సామాన్య నేతగా ఆయన మారిపోయారు. వైఫల్య బాధ్యత తనదే అని స్వయంగా ప్రకటించారు. ఈ వ్యూహాత్మక మార్పు తాత్కాలికం కావచ్చునేమో కానీ మోదీలో అది నిస్సందేహంగా ఒక గమనార్హమైన మార్పు. తాను బిగ్‌బాస్ అయినప్పటికీ అప్పుడప్పుడూ తప్పులు చేసే వాడినేనని ఆయన చెప్పదలుచుకున్నారు. తద్వారా దురహంకారి అయిన నిరంకుశ పాలకుడు అనే ప్రత్యర్థుల విమర్శలోని తీవ్రతను తగ్గించడమే ఆయన ఉద్దేశ్యమని అర్థమవుతోంది. మోదీ మొదటి ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు 2016లో పెద్దనోట్ల రద్దు నిర్ణయం తీసుకునేందుకు ఆయన్ని పురిగొల్పాయి. ఆ నిర్ణయంతో తనను తాను శక్తిమంతుడినైన ప్రధానమంత్రిగా ఆయన నిరూపించుకున్నారు. అంతేకాకుండా అవినీతి వ్యతిరేక ధర్మ పోరాట యోధుడిగా ప్రజల్లో పేరు పొందారు. సాగుచట్టాల విషయంలో నరేంద్ర మోదీ 'క్షమాపణ' చెప్పడం ఒక వ్యూహాత్మక చర్యే. అయితే పేదరైతు సంరక్షకుడిగా ప్రజల మనస్సుల్లో తన గురించి ఉన్న ఒక భావనను మరింత పటిష్ఠం చేసుకునే ప్రయత్నంతో ముడివడివున్న చర్య అది. ఎన్నికల ప్రచార సభలలో మోదీ ఉపన్యాసాలను నిశితంగా పరిశీలించండి. పేద రైతు శ్రేయస్సు విషయంలో తన నిబద్ధత గురించి ఆయన ప్రస్తావించిన ప్రసంగం ఒకటంటే ఒకటి కూడా లేదు. నోట్ల రద్దుతో దేశ ధనిక వర్గాల వ్యతిరేకతను భరించగల సత్తా మోదీకి ఉంది. అలాగే పెట్రోలియం ఉత్పత్తుల ధరలు మిన్నంటేందుకు అనుమతించడం ద్వారా మధ్యతరగతి వర్గాల ఆగ్రహావేశాలను కూడా ఆయన తట్టుకోగలరు. అలాగే హిందూత్వ భావోద్వేగాలను పురిగొల్పడం ద్వారా సంపన్న, మధ్యతరగతి వర్గాలను, తన పక్షాన నిలుపుకోగల సామర్థ్యమూ ఆయనకు ఉంది. 2002 అనంతర గుజరాత్ ఓటర్లలోని 'నయా మధ్య తరగతి' హిందూ ఓటర్లను సంఘటితం చేసేందుకే 'హిందూ హృదయ్ సమ్రాట్' (హిందూ హృదయాల చక్రవర్తి) అనే విశేషణాన్ని సృష్టించి ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. దేశవ్యాప్తంగా పేద రైతులు ఎంతోమంది ఉన్నారు. నిరుపేద ప్రజలు అసంఖ్యాకంగా ఉన్నారు. మరి వారందరూ తమ శ్రేయస్సునకు అంకితమైన 'వికాస్ -పురుష్' (అభివృద్ధి సాధకుడు)గా ప్రధాని మోదీని భావించవలసిన అవసరం ఎంతైనా ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు 'ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి'ని ప్రారంభించారు. కనీస ఆదాయానికి భరోసా కల్పించి రైతులను ఆకట్టుకునే లక్ష్యంతోనే ఆ 'నిధి'ని ప్రారంభించారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే సాగుచట్టాల రద్దుకోసం ఢిల్లీ శివార్లలో నిరసనోద్యమానికి దిగిన రైతుల విషయంలో పాలకులు వ్యవహరించిన తీరుతో రైతు శ్రేయస్సుకు అంకితమైన నాయకుడిగా మోదీ పొందుతున్న గౌరవానికి తీవ్ర విఘాతం వాటిల్లింది. ఉద్యమిస్తున్న రైతులు 'అరాచకవాదులు' అనీ, 'ఉగ్రవాదులు' అనీ మోదీ సర్కార్ నిందించింది. తద్వారా విశాల ప్రజానీకం మద్దతు వారికి లభించకుండా ఉండేలా అడ్డుపడింది. ప్రభుత్వ గర్హనీయ తీరు తెన్నులకు అన్నదాతలు ముఖ్యంగా పంజాబ్ రైతులు తీవ్రంగా స్పందించారు. పరిస్థితులు విషమించాయి. సాగుచట్టాల లక్ష్యాలు, ఆచరణీయత విషయం అటుంచి రైతు వ్యతిరేకిగా నరేంద్ర మోదీపై రైతులలోనూ, విశాల ప్రజానీకంలోనూ ఒక అభిప్రాయం దృఢపడింది. దీనివల్ల తనకు, తన పార్టీకి తీవ్ర హాని జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించారు. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న రైతుల పైకి ఒక కేంద్రమంత్రి కుమారుడు అమానుషంగా కారును నడపడం దేశప్రజలను దిగ్భ్రాంతి పరిచింది. ఆ ఘటన సాగుచట్టాల వ్యతిరేక ఉద్యమంలో నిస్సందేహంగా ఒక ముఖ్యమలుపు అయింది. మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. లఖీంపూర్ ఘటన, బీజేపీ మీడియా మేనేజర్లు అంగీకరించిన దానికంటే చాలా ఎక్కువగా ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తీసింది. ఇది, వార్తలకు భౌగోళిక హద్దులు పూర్తిగా చెరిగిపోయిన కాలం కదా. లఖీంపూర్ ఘటన, అది జరిగిన ప్రదేశంలోనే కాదు, ఆసేతు హిమాచలం ప్రతి రైతునూ తీవ్ర ఆగ్రహావేశాలకు లోను చేసింది. రాకేశ్ తికాయత్ వంటి రైతు నేతకు హర్యానా, పంజాబ్, యూపీలోనే కాకుండా మహారాష్ట్ర, దక్షిణాది రాష్ట్రాలలో కూడా ఆదరణ ఇతోధికంగా పెరిగిపోయింది. తికాయత్ దేశంలో ఎక్కడకు వెళ్ళినా ఆయన సభలకు ప్రజలు వెల్లువెత్తుతున్నారు. ఈ పరిస్థితుల్లో 'ఆందోళన్ జీవి'గా మారిన రైతన్నను ప్రభుత్వం ఎలా ఉపేక్షించగలదు? లోక్‌సభలో భారీ మెజారిటీ ఉన్న కారణంగా రైతుల ఆందోళనను మోదీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు. గర్హనీయంగా నిర్లక్ష్యం చేసింది. అడ్డు అదుపులేని ఈ దురహంకార ధోరణి చివరకు మోదీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించేందుకు దారితీసింది. అంతిమంగా సాగుచట్టాలను ఉపసంహరించుకోవడం ద్వారా ప్రధానమంత్రి తన ప్రతిష్ఠకు వాటిల్లుతోన్న నష్టాన్ని కొంతమేరకు తగ్గించుకోగలిగారు. రైతుల పట్ల మోదీ వైఖరిలో ఆకస్మిక మార్పు ఆయన హృదయ పరివర్తన ఫలితం కాదు. రాజకీయాలలో సదా ఒక అంతర్వాణి వినిపిస్తుంటుంది. ఏ నాయకుడూ దానిని విస్మరించడు, నిర్లక్ష్యం చేయడు. చేయలేదు. ఎన్నికల నగారాయే ఆ అంతర్వాణి.

# పాలనలో దివ్యాంగులకు ప్రాతినిధ్యం

స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలైనా రాజ్యాంగం ద్వారా లభించిన ప్రాథమిక హక్కులు గాని, ఆదేశిక సూత్రాలు గాని, న్యాయ స్థానాల ద్వారా వర్తించే పౌర హక్కులు గాని దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా అమలు కావటం లేదు. రాజకీయ భాగస్వామ్యం లేకపోవటంతో దివ్యాంగులు వెనుకబాటుతనానికి గురవుతున్నారు. ప్రతిచోట అథమ శ్రేణి పౌరులుగానే పరిగణించబడుతున్నారు.జనాభాలో పది శాతం ఉన్న దివ్యాంగులకు కనీస హక్కులు, న్యాయం అందటం లేదు. వైకల్యం పట్ల వివక్ష లేని సమాజ నిర్మాణ లక్ష్యాలను మానవ హక్కుల కోణం నుంచి పరిశీలించాలి. ''దివ్యాంగుల చేత దివ్యాంగుల యొక్క దివ్యాంగుల కొరకు'' అన్న విధంగా దివ్యాంగుల సాధికారిత సాధన కావాలి. నిరక్షరాస్యులైన తల్లిదండ్రుల వలన, ప్రభుత్వాల లోపభూయిష్టమైన పాలన మూలంగా అనేక మంది దివ్యాంగులు తయారైనారు. తరతరాలుగా వివక్షకు, అపహాస్యాలకు, దోపిడికి గురైన దివ్యాంగులకు సాంఘిక న్యాయం అందకపోగా, సకలాంగుల చేతిలో దౌర్జన్యాలకు, అత్యాచారాలకు, దాడులకు, అకృత్యాలకు గురవుతున్నారు. రాజకీయ అధికారమే మాస్టర్ కీ అని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గతంలోనే చెప్పారు. రాజకీయ అధికారం ఎవరి చేతుల్లో ఉంటుందో వారే అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించగలరు. గ్రామ స్థాయి వార్డు మెంబర్లు మొదలుకొని పార్లమెంట్ వరకు చట్టసభల్లో దివ్యాంగులను భాగస్వామ్యం కల్పించినప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి. కాలానుగుణంగా సమాజంలో వచ్చే మార్పులను, దివ్యాంగులపై వాటి ప్రభావాన్ని నిరంతరం అధ్యయనం చేయాలి. దీని కోసం ప్రతి జిల్లా కేంద్రంలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దివ్యాంగుల సమస్యలపై ఈ కేంద్రాల్లో తరచూ చర్చలు జరగాలి. దివ్యాంగులు పరస్పరం తరచు మాట్లాడుకునే ఏర్పాట్లు చేయటం వల్ల వారిలో న్యూనతా భావం పోయి ఆత్మస్థైర్యం పెరిగే అవకాశం ఉంటుంది. చట్టాలపై దివ్యాంగులకు అవగాహన ఉండాలి. దివ్యాంగ మహిళలపై వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నా ఆ సంఘటనలు వెలుగు చూడటం లేదు. చట్టాలు తెలియక వారు అన్యాయానికి గురవుతున్నారు. వారిలో ఆత్మస్థైర్యం, సమానత్వ స్పృహ కల్పించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై వుంది. 1995, 2016 దివ్యాంగుల చట్టాల ప్రకారం దివ్యాంగులను మానసికంగా గానీ, శారీరకంగా గానీ హింసకు గురిచేస్తే చట్ట రీత్యా కఠిన శిక్షలు తప్పవని అందరికీ అర్థం అయ్యే విధంగా వివరించాలి. దివ్యాంగులు తమకు జరిగిన అన్యాయం గురించి సమీప పోలీసు స్టేషనుకు వెళ్ళి ఫిర్యాదు ఇచ్చే స్థితిలో వారిలో చైతన్యం



కలిగేలా చర్యలు తీసుకోవాలి. అధికారిక నామినేటెడ్ పదవుల్లో దివ్యాంగులకు జనాభా ప్రాతిపదికన స్థానాల్ని కేటాయించాలి. ముందుగా పాలకుల్లో, ప్రభుత్వంలో, అధికారుల్లో మార్పు రావాలి. వీరు దివ్యాంగులను గౌరవిస్తే అందరూ గౌరవించటం ప్రారంభిస్తారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాలు వారి అభ్యున్నతికి సంబంధించి నిర్దిష్టమైన చర్యలు ప్రకటించాలి.

# సర్.సి.ఆర్ రెడ్డి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

## జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలని ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు పీ డీ ఎస్ యూ ధర్నా



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : ఎయిడెడ్ గా కొనసాగిస్తామని ఇచ్చిన హామీని విస్మరించిన ఏలూరు సర్.సి.ఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఎయిడెడ్, అన్ఎయిడెడ్ పీజీ విద్యార్థులకు విద్యా దీవెన,వసతి దీవెన పథకాలను రద్దు చేస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 77 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిచంద్ర మాట్లాడుతూ ఏలూరు సి. ఆర్. రెడ్డి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఎయిడెడ్ గా కళాశాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చి నేడు విస్మరించిందని తెలిపారు.కళాశాల కార్యదర్శి పలు దఫాలుగా హామీ ఇచ్చి నేడు యూటర్న్ తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఎస్సీ,ఎస్టీ,బిసి,పేద ఓసి,మైనారిటీ విద్యార్థులకు ఫీజుల భారం అధికంగా పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు బోధనా ఫీజులు, ఉపకారవేతనాలు రావన్నారు.హామీ ఇచ్చి విస్మరించిన సి.ఆర్.రెడ్డి కళాశాల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు.అన్ ఎయిడెడ్ విద్యాసంస్థలుగా మారి విద్యార్థులను ఫీజుల కోసం యాజమాన్యాలు పీడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎయిడెడ్ సంస్థగా సి.ఆర్.రెడ్డి కళాశాల కొనసాగించే వరకు ఉద్యమిస్తామని తెలిపారు.మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కాలం నుండి ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పీజీ విద్యార్థులకు విద్య దీవెన, వసతి దీవెన పథకాలను అమలు చేయడం లేదన్నారు.అందుకోసం ప్రభుత్వం జారీ చేసిన 77 జీవో తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎంటెక్, ఎంబీఏ, ఎంఫార్మసీ, ఎమ్ఎస్సి, ఎంఏ, ఎంకామ్ తదితర మాస్టర్ డిగ్రీ కోర్సులకు బోధనా ఫీజులు రాని కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.జగన్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతోందని దుయ్యబట్టారు. మామయ్యగా అండగా ఉంటానని చెప్పిన జగన్ విద్యార్థులకు ఫీజులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. నాణ్యతా, ప్రమాణాలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థులకు నష్టకరంగా మారిన జీవో నెంబర్ 77 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేని ఎడల పెద్దఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఉన్నత విద్యామండలి కార్యదర్శి బి.సుధీర్ ప్రేమ్ కుమార్ కు నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ,భూషణం, రాష్ట్ర నాయకులు కాకి నాని, ఎన్. వి. మహర్షి, ఐ. రాజేష్, నాయకులు ఎం.జానకిరామ్,మణిందర్,సాయి కృష్ణ, ఎన్.కృష్ణ, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## "పరిహారమిచ్చి రైతుల్ని ఆదుకోండి": తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణ చంద్రరావు



చిలకలూరిపేట :(ప్రజాపాలన ప్రతినిధి) నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం గ్రామంలో అకాల వర్షాలకు పాడై పోయినా పత్తి, మిరప పొలాలను, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం పూర్ణచంద్రరావు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వర్షాలకు పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం 50,000/- రూపాయల పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మిర్చికి తామరపురుగు, బొబ్బర తెగులు, పత్తి కి గులాబీ పురుగుతో పాటు అధిక వర్షాలకు పూర్తిగా పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని వెంటనే నష్ట పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్ పుట్ సబ్సిడీతో పాటు పంటభీమా అందించాలని సూచించారు.

## సుగాలి కాలనీలో ఆక్రమణలు తక్షణమే నిలుపుదల చేయండి..అఖిలపక్ష నాయకులు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణంలోని సుగాలి కాలనీలో ఆక్రమణల పేరిట మున్సిపల్ అధికారులు, 34వ వార్డు వైసీపీ కౌన్సిలర్ చిరు వ్యాపారాలు చేసుకుంటున్నా వారి దుకాణాలను తొలగించడం జరిగింది. ఈ మేరకు బాధితులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం తెలిపారు.వారికి సంఘీభావంగా చిలకలూరిపేట అఖిలపక్షం మద్దతు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చిన్న ...చిన్న దుకాణాలు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నా (సుగాలి )ఎస్టి సామాజిక వర్గాలకు చెందిన వారి దుకాణాలను తొలగించడం చాలా దుర్మార్గమైన చర్య అని నాయకులు తీవ్రంగా ఖండించారు. చిలకలూరిపేటలో చాలా ఆక్రమణల ఉండగా సుగాలి కాలనీ లోనే ఆక్రమణల తొలగింపు ఏమిటని ప్రశ్నించారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొన్ని సంవత్సరాల నుంచి వ్యాపారం చేసుకుంటున్నా ఎస్టీ సామజిక వర్గీయుల వారి దుకాణాలు తొలగించటం పట్ల నాయకులు ఆగ్రహ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ డి.రవింద్ర మాట్లాడుతూ రేపు ప్రత్యేకమైన ఎంక్వయిరీ చేసి బాధితులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం బాధితులు కమిషనర్ కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, ఎస్సీ,ఎస్టీ ,బీసీ, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నెల్లూరు విచ్చేసిన కోడల శివ రామ్



నెల్లూరు, డిసెంబర్ 3, ప్రజాపాలన ప్రతినిధి: నవ్యాంధ్ర తొలి శాసనసభాపతి కోడెల శివప్రసాద్ కుమారుడు కోడెల శివరాం అమరావతి రైతులు చేపట్టిన న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్రకు సంఘీభావం తెలుపుట కొరకు నెల్లూరు నగరానికి శుక్రవారం విచ్చేశారు.అందులో భాగంగా నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ని హరనాథపురంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.తొలిసారి తన నివాసానికి రావడంతో కోడెల శివరాంను అబ్దుల్ అజీజ్ శాలువాతో సత్కరించారు.

# అవయవలోపం శాపం కాదు



ఉండి, డిసెంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : అవయవలోపం శాపంకాదని సమాజంలో కొందరు దురదృష్టవశాత్తు అవయవలోపంతో జన్మిస్తారని వారిని దివ్యాంగులుగా పిలుస్తామని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాగిత మహంకాళి, గాదిరాజు రంగరాజులు అన్నారు. శుక్రవారం ఉండి భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మహంకాళి, రంగరాజులు మాట్లాడుతూ 1982లో ఐక్యరాజ్యాసమితి డిసెంబర్ 3వ తేదీని ప్రపంచ వికలాంగుల దినంగా ప్రకటించిందని ప్రధాని మోదీ వికలాంగులు అనేపదాన్ని తొలగించి దివ్యాంగులు గా పిలవాలని కోరారని విద్యా పరిభాషలో వారిని ప్రత్యేక అవసరాల పిల్లలుగా పిలుస్తారని తెలిపారు. ముఖ్యఅతిధి గా హాజరైన తహసీల్దార్ కృష్ణజ్యోతి మాట్లాడుతూ దివ్యాంగులపట్ల చిన్నచూపు తగదని వారికి తగిన ఆత్మ విశ్వాసం కలిగిస్తే సాధారణ వ్యక్తులతో పోటీ పండగలరని అన్నారు. మరో ముఖ్యఅతిధి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అనేక వసతులు కలిపిస్తుందని దివ్యాంగులకు క్రీడలు నిర్వహించి లయన్స్ క్లబ్ ద్వారా వారికి బహుమతులు అందజేయడం అభినందనీయమని అన్నారు. దాత లయన్ బుద్ధరాజు సుబ్బరాజు మాట్లాడుతూ దివ్యాంగులకు సేవచేయటం అభినందనీయమని అన్నారు. అనంతరం క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులకు అతిథుల చేతులమీదుగా బహుమతులు, బిస్కెట్లు, చాక్లెట్లను అందించారు. ఈకార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు చంద్రకళ, తబిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బి.ఎం.ఆర్ గ్రూప్స్ స్టాల్ ను సందర్శించిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు




నెల్లూరు డిసెంబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి: భీమవరంలో 20 వ ఆక్వా టెక్ ఎక్సిబిషన్ ఎం.ఆర్ గ్రూప్ స్టాళ్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు సందర్శించి ప్రారంభించారు. వారితో పాటు గోకరాజు రామరాజు, ఉండి మాజీ శాసనసభ్యులు పాతపాటి సర్రాజు, మాజీ శాసనమండలి సభ్యులు మేక శేషు బాబు, సూర్యమిత్ర గ్రూప్ చైర్మన్ ఇర్రింకి సూర్యా రావు సందర్శించారు.బి.ఎం.ఆర్ ఇండస్ట్రీస్ యొక్క వివిధ ఉత్పత్తులను అతిథులకు వివరించారు. బి.ఎం.ఆర్ గ్రూప్ ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను అతిధులు కొనియాడారు.

## నామమాత్రపు రుసుముతో సంపూర్ణ గృహ హక్కు: మంత్రి శ్రీరంగనాథరాజు



ఉండి, డిసెంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంద్వారా లబ్ధిదారులకు భూమిపై శాశ్వత హక్కు లభిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ. శ్రీరంగనాథరాజు అన్నారు.ఉండి మండలం యండగండిలో శుక్రవారం జగనన్న శాశ్వతగృహ పథకంలో లబ్ధిపొందిన శ్రీనివాసరాజుకు రుణవిముక్తి ధ్రువీకరణ పత్రాన్ని మంత్రి శ్రీరంగనాథరాజు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు నామమాత్రపు మొత్తాన్నిచెల్లిస్తే వారికున్న భూమిపై సర్వహక్కులు సంక్రమించనున్నాయని జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకంకింద అమలుచేస్తున్న వన్ టైమ్ సెటిల్మెంట్ ద్వారా లబ్ధిదారులకు శాశ్వత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అందజేయడం జరుగుతుందని అన్నారు. భవిష్యత్తులో హక్కుదారులు అవుతారని దీనిని ప్రభుత్వం కల్పించిన సువర్ణవకాశంగా భావించి అర్హతఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రంగనాథరాజు కోరారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ డి.ఈ పి.శివరామరాజు, ఏ.ఈ డి. రామకృష్ణరాజు, గ్రామ సర్పంచ్ గోగులమండ చిన కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న గోరుముద్ద లో నాణ్యమైన భోజనం అందించాలి-మున్సిపల్ కమీషనర్



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)మున్సిపల్ పాఠశాల యందు విద్యార్ధులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం(జగనన్న గోరుముద్ద )లో నాణ్యమైన పోషక విలువలు కల్గిన ఆహారాన్ని విద్యార్ధులకు అందించాలని మున్సిపల్ కమీషనర్ దేవరపల్లి రవీంద్ర అన్నారు. చిలకలూరిపేట పట్టణంలోని శుక్రవారం డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల యందు మధ్యాహ్నభోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులందరూ ఒక్కొక్కరోజు ఒకరు తప్పకుండా భోజనం రుచిచూసిన తర్వాతనే విద్యార్థులకు వడ్డించేలా మధ్యాహ్నభోజన సిబ్బందికి సూచించారు. ప్రధానోపాధ్యాయులు,వార్డు విద్యా కార్యదర్శి కామేశ్వరరావుకి ఐయంయంయస్ యాప్ నందు ప్రతి రోజూ వివరాలు నమోదుచేయాలని సూచించారు.భోజనం తయారీ సమయంలో పరిశుభ్రత పాటించాలన్నారు. అందరూ కోవిడ్ జాగ్రత్తలు పాటించాలన్నారు.ప్రతిరోజూ మోనూ తప్పకపాటించాలన్నారు. మధ్యాహ్నభోజన పథకం, రిజిస్టర్లు,రికార్డులయందు ప్రతిరోజూ స్టాకు,వివరాలు నమోదు చేయాలన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల సూపర్ వైజర్ పోటు.శ్రీనివాసరావుఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు కె.సుధ,ఉపాధ్యాయులుఏ.నీలిమ.టి.కుమారి పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో సివిల్ కేసుల పరిష్కారానికి కృషి



నరసాపురం, డిసెంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : న్యాయవాదులు తమ కక్షిదారులతో మాట్లాడి పెండింగులో ఉన్న సివిల్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ఇప్పటినుండి 11వ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరిగేవరకు ప్రతిరోజు ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహిస్తామని రాజీకి అవకాశమున్న కేసులలో న్యాయమూర్తులు చొరవ తీసుకుని రాజీకి ప్రయత్నిస్తారని పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవాసంస్థ చైర్మన్ పి. విజయదుర్గ అన్నారు. శుక్రవారం స్థానిక బార్ అసోసియేషన్ హాలులో జాతీయ లోక్ అదాలత్ లో కేసుల రాజీకొరకు న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సివిల్ జూనియర్ జడ్జి వి.గౌరీ శంకరరావు, ఒకటవ అదనపు సివిల్ జూనియర్ జడ్జి పి.ఎస్.వి.బి కృష్ణ సాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి కృష్ణారావు, సెక్రటరీ ఆర్ పుల్లాజి, న్యాయవాదులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల రాజీకి సహకరిస్తామని ఈ సందర్భంగా న్యాయవాదులు తెలిపారు.

## ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం నిధులు దారి మళ్లించొద్దని, వాటిని వర్శిటీ అవసరాలకు ఉపయోగించాలని పిడిఎస్ యు వి.సికి వినతి



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం చెందిన నాలుగు వందల కోట్ల రూపాయలను ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ కు బదలాయించవద్దని, వాటిని యూనివర్సిటీ అవసరాలకు, అభివృద్ధికి ఉపయోగించాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీ డీ ఎస్ యూ) రాష్ట్ర ప్రతినిధి బృందం శుక్రవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ పి. శ్యాం ప్రసాద్ కి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిధులు నాలుగు వందల కోట్ల రూపాయలను ఏపీ ఎస్ ఎఫ్ ఎస్ సీ ఎల్ కు బదలాయింపు చేయడం సహేతుకం కాదని పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం రామకృష్ణ , యు . గని రాజు అన్నారు. పాలక మండలి తీర్మానం లేకుండా ఏకపక్షంగా నిబంధనలకు విరుద్ధంగా, స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ బదలాయించడం ప్రభుత్వ మెప్పు పొందడానికి వైస్ ఛాన్సర్ వైఖరి ఉందని తీవ్రంగా విమర్శించారు . .వర్సిటీ వార్షిక ఖర్చు 68 కోట్ల రూపాయలు అవుతుంది. ప్రభుత్వం ప్రతీ ఏటా కేవలం ఐదు కోట్లు మాత్రమే కేటాయిస్తుందని అన్నారు .ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్, వర్సిటీ అభివృద్ధి ఇతర అవసరాల కోసం ఆ నిధులను ఉపయోగించకుండా ప్రభుత్వం నాలుగొందల కోట్ల రూపాయలను తీసుకోవడం హేతుబద్ధం కాదు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధనలు,ల్యాబ్, లైబ్రరీ వసతులు, ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవడానికి నిధుల అవసరము వుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం. నిర్లక్ష్యంగా యూనివర్సిటీ నిధులు నాలుగొందల కోట్ల రూపాయలను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అభివృద్ధికి ఉపయోగించాలి తప్ప ఇతర అవసరాలకు నిధులు కేటాయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. . ఇప్పటికైనా ప్రభుత్వం వర్సిటీ నిధులు తిరిగి యూనివర్సిటీకి జమ చేయాలని యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం. రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యు. గని రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. రాజశేఖర్, ఎన్. నాని, తదితరులు ఎన్టీఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కి వినతి పత్రం అందజేశారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు.

## ఉచితంగా హోమియో మందుల పంపిణీ



చీరాల(ఒంగోలు) : చీరాల పట్టణములో సమాజ్వాది పార్టీ ఆధ్వర్యంలో, డెంగ్యూ,మలేరియా వంటి విష జ్వరాలు సోకకుండా, సమాజ్ వాదీ పార్టీ నాయకులు సయ్యద్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీం భాయ్, అస్మత్ ఆలీలు., ఉచిత హోమియోమందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, సమాజ్వాదీ పార్టీ నాయకులు సయ్యద్ బాబు మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలకు డెంగ్యూ,మలేరియా బారినపడి ఎంతోమంది ఏరియా వైద్యశాలలో చేరుతున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు వైద్యశాలల్లో ఈ రోగాలకు చికిత్స పేరిట,వేలకు వేలు వసూలు చేస్తున్నారని,అధికారులు ఆ దిశగా దృష్టి సారించాలని, డిమాండ్ చేస్తున్నామని వారు అన్నారు.

## కనుమర్లపూడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిపిఎస్ అధినేత ప్రకాష్ రావ్



కావలి, డిసెంబర్ 3, ప్రజాపాలన ప్రతినిధి:మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనుమర్లపూడి నారాయణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.శుక్రవారం బిపిఎస్ అధినేత బెజవాడ ప్రకాష్ రావు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు అందజేశారు. వారి వెంట బిపిఎస్ సిబ్బంది కొండయ్య , వంశీ తదితరులు పాల్గొన్నారు

# అధికార పార్టీ నేతలు, ప్రజల సమస్యలు పట్టనట్లు వ్యవహరించడం కడుశోచనీయం



ఒంగోలు : అధికారుల సాక్షిగా, అన్యమత ప్రార్ధనలు అత్యంత హేయమైన చర్య అని, ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా, కృషి చేయాల్సిన అధికార పార్టీ నేతలు, అవేమీ పట్టనట్లు వ్యవహరించడం కడు శోచనీయమని, బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో, బీజేపీ ఒంగోలు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు యస్.శ్రీనివాసరావు అధ్యర్యంలో,ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఖలీఫాతుల్లాబాషా మాట్లాడుతూ, ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పేరుతోటి, మరొకసారి మత ప్రచారానికి పాల్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో, ఒంగోలులో అధికారికంగా నిర్వహించినటువంటి, ప్రపంచ ఎయిడ్స్‌దినోత్సవ కార్యక్రమంలో, ప్రభుత్వ అధికారుల సాక్షిగా, అన్యమత ప్రార్ధనలు చేసి, వైద్య శాఖ అధికారులు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించడం దారుణమన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఒక మత ప్రచారానికి పాల్పడ్డ వైద్యశాఖ సిబ్బంది పై బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఖలీఫాతుల్లాబాషా ప్రకాశం జిల్లా కలెక్టర్‌ను కోరారు. బీజేపీ అన్ని మతాలను గౌరవిస్తుందని,అయితే ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జరిగిన, ప్రభుత్వ కార్యక్రమాలలో విద్యార్థులతో, క్రిస్టియన్ మతంకు సంబందించిన, క్యారిబ్యాగ్ విద్యార్థుల చేతిలో ఉంచి ప్రదర్శించడాన్ని, బీజేపీ ఖండిస్తుందని చెప్పారు.ఒంగోలు నగరంలో అన్ని డివిజన్లలో పారిశుద్ధ్యనమన్య తీవ్రంగా ఉన్న ఒంగోలులో,నగర అభివృద్ధి కుంటుపడినా, స్థానిక శాసనసభ్యులు, మంత్రి బాలినేని.శ్రీనివాసరెడ్డి,పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈమధ్య కరోనా కొత్త వేరియంట్ కూడా వస్తున్న నేపథ్యంలో, నగర పాలక మండలి సభ్యులు పారిశుద్ధ్యం విషయంలో, తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరులసమావేశంలో బీజేపీ నాయకులు పివి.శివారెడ్డి,ఎస్సీ మోర్చాజిల్లా అధ్యక్షుడు బాలకోటయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి రాయపాటి అజయ్,ఒంగోలు నగర ఐదవ మండల అధ్యక్షుడు కంభంపాటి అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## దేవినేని శ్రీమన్నారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

కంచికచర్ల డిసెంబర్ 3 ప్రజా పాలన ప్రతినిధి:మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తండ్రి దేవినేని శ్రీమన్నారాయణ స్వర్గస్తులైనారు.అయన పార్థివ దే హానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించినివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ దేవినే ని ఉమా కుటుంబానికి అయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందని అన్నారు.

## దివ్యాంగుల దినోత్సవం



ఏలూరు, డిసెంబరు 03 ప్రజాపాలన ప్రతినిధి: దెందులూరు నియోజకవర్గం ఈ రోజు పెదపాడు మండలం పెదపాడు గ్రామంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొని సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ మనుషులంతా సమానమేనని, దివ్యాంగుల పట్ల చిన్న చూపు చూడకుండా, వారిలోని ప్రతిభను గుర్తించి వారికి చేయూతనిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. వైకల్యంతో ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ, మనోధైర్యంతో ముందడుగు వేస్తూ, జీవితాన్ని జయిస్తూ మనందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నందుకు వారందరికీ అభినందనలు తెలియజేశారు. అదే విధంగా వికలాంగుల పెన్షన్ అందని వారు ఎవరైనా ఉంటే తప్పకుండా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే దివ్యాంగులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. అలాగే వారికి స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్సిపి అభిమానులు అక్కా చెల్లెమ్మలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆర్థికంగా స్థిరపడి, రైతన్నల మోముపై చిరునవ్వు ఉండాలనేది లక్ష్యం

### రైతు భరోసా కేంద్రం అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల(ఒంగోలు) : రైతన్నల మోముపై చిరునవ్వుయే లక్ష్యంగా, వ్యవసాయం లాభసాటిగా ఉండి, రైతులు ఆర్థికంగా స్థిరపడాలని ధ్యేయంగా, ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతు భరోసా కేంద్రం అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. చీరాల మండలం కొత్తపాలెం పంచాయతీలో పొలం బడి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా, చీరాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి పాల్గొని,పంటపొలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్న ఆశయాల సాధనకు, రైతుల సంక్షేమానికి,చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి,ఆయన కుమారుడు వైసిపి యువ నేత కరణం వెంకటేష్ బాబు లు కృషి చేస్తున్నారన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాయితీలు అందకపోయినా,తన దృష్టికి తీసుకువస్తే,ఎమ్మెల్యే బలరాం, యువ నేత వెంకటేష్ లకు తెలియజేసి, సత్వరమే సమస్య ను పరిష్కరించేందుకు, కృషి చేస్తానన్నారు. రైతులకి వ్యవసాయ కిట్టులను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమానికి చీరాల మండల వ్యవసాయ అధికారి సుమతి, వివిధ ఆర్ బి కె ల అధికారులు ,రైతులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమా ర్, ఎమ్మెల్యే జగన్ పరామర్శ



కంచికచర్ల డిసెంబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి:మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ,వైసీపీ నేత దేవినేని చంద్రశేఖర్ తండ్రి దేవినేని శ్రీమన్నారాయణ మృతి



చెందడంతో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరు ణ్ కుమార్ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు కంచికచర్ల లోని వారి స్వగృహానికి చేరుకొని ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ,పూల మాలలు వేసి ని వాళు లర్పించారుఅనంతరం వారి కుటుంబ సభ్యుల ను పరామర్శించి ,తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేసారు ,ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పరమేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



భీమవరం, డిసెంబర్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) :పరమేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మహా శివుని ప్రార్థించానని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక పంచారామ క్షేత్రం శ్రీ ఉమా సోమేశ్వర జనార్ధనస్వామివారి వద్ద నందమూరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి హాజరైన శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తీకమాసమంతా పంచారామక్షేత్రంలో ఉమాసోమేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడంతో పాటు భక్తులందరికీ అవకాశం కల్పిస్తూ కోటి దీపోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. మహాశివుని దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. అనంతరం ఆయన సోమేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, వైసిపి నాయకులు కామన నాగేశ్వరరావు, కోడే యుగంధర్, ,ఆకుల సుబ్బలక్ష్మి, నందమూరి సుధాకర్, నందమూరి ఆంజనేయులు, మానేపల్లి నాగన్నబాబు, నల్ల రాంబాబు , రెడ్డి సత్తిబాబు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే మల్లాది విష్ణు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 8 మంది లబ్ధిదారులకు రూ. 3 లక్షల 36 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సెంట్రల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 748 మందికి రూ. 3 కోట్ల 52 లక్షల 36 వేల రూపాయలకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుందని ఈ సందర్భంగా మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వాస్పత్రులను మరింత బలోపేతం చేసి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో వైద్య రంగానికి కేటాయింపులు విశేషంగా పెంచారని మల్లాది విష్ణు గారు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తూ.. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవల్లో ఘననీయమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1,096 చికిత్సలను మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురాగా వాటిని ఈ ప్రభుత్వం 2,446 కు పెంచడం జరిగిందన్నారు. ఆస్పత్రుల బకాయిలను సైతం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నట్లు తెలియజేశారు. అంతేకాకుండా పొరుగు రాష్ట్రాల్లోని 130 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పేదలు వైద్యం పొందే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. కోవిడ్ బాధితులకు ఉచితంగా వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా అందిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచామన్నారు. మరోవైపు నియోజకవర్గంలో దరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరవుతోందని వెల్లడించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి గారు చేస్తున్న మంచి పనులకు ప్రజలందరూ అండగా నిలబడాలని ఈ సందర్భంగా మల్లాది విష్ణు గారు కోరారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో పురోగతి లేదు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)మండలం లోని మురికిపూడి గ్రామానికి చెందిన జమ్మలమడక ఆది బాబు రాష్ట్ర ఎస్సీ చైర్మన్ కమిషన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ కు కమిషన్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వ్యవసాయ భూమి విషయంలో తమ గ్రామానికి చెందిన ఆరు మళ్ల వెంకట శివ, ఆరుద్రఅనిల్ పైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం క్రింద కేసు నమోదు అయి 8 నెలలు కావస్తున్నా. ఇంతవరకు వారిపైన ఇటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. నాఅట్రాసిటీ కేసులో ఎటువంటి పురోగతి లేకుండా పోయిందని వాపోయారు.ప్రభుత్వం నుంచి తనకు రూ.50,000వేలు నష్ట పరిహారం వచ్చిందని పేర్కొన్నారు. పోలీస్ వారు వాళ్లను తక్షణమే అరెస్ట్ చేసే విధంగా చేసి తగిన న్యాయం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపలు అడపా మోహన్, ఏ.పి గిరిజన సంఘాల ఐక్యవేది రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్,దళిత నాయకులు నేలం ఏసు రాజు తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను గౌరవించడం దేవున్ని పూజించడమే -ఎ.జి.పి. మట్టా ప్రసాద్



కంచికచర్ల డిసెంబర్3 ప్రజాపాలన ప్రతినిధి:ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని కంచికచర్ల పట్టణములోని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ కార్యాల యమునందు ఎన్.సి.సి. కృష్ణాజిల్లా దివ్యాంగుల వి భాగపు అధ్యక్షులు జల్లి అబ్రహాము సన్మాన కార్యక్ర మం రాష్ట్ర మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ ఘం టా విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగింది.ముఖ్య అ తిథిగా ఎడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ (ఎ.జి.పి) మ ట్టా ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ దివ్యాం గు ల దినమున నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ నందు దివ్యాంగులకు నాయకత్వం వహిస్తున్న అబ్రహామును సన్మానించడం దేవుని పూజించడమే అని, దివ్యాంగు ల కార్పొరేషన్ నుండి 14 ట్రై సైకిల్స్, 3 వీల్ చైర్స్ విభిన్న ప్రతిభావంతులైన వ్యక్తులకు అందచేయుటకు విశేషమైన కృషిచేసినఅబ్రహాముఅభినందనీయుడని, రానున్న రోజుల్లో వికలాంగులకు మరెన్నో కార్యక్రమ ములు నిర్వహించాలని ఉన్నత పదవులను అలంకరించాలని అభినందించారు.ఈ సన్మాన కార్యక్రమం లో ఎన్ సి సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొక్కా జార్జి ముల్లర్, కోస్టల్ కోఆర్డినేటర్ పాల్ శంకర్ రెడ్డి, కృష్ణా జిల్లా అధ్యక్షులు హానోకు, ప్రధాన కార్యదర్శి హిజ్కి యారాజు కంచికచర్ల మండల గౌరవ అధ్యక్షులు శాం పాల్, కార్యదర్శి విల్సన్, ఉపాధ్యక్షులు విజయ్, షా లేమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా "స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం





విజయవాడ డిసెంబర్ 3 ప్రజాపాలన ప్రతినిధి:విజ యవాడ రూరల్ పాతపాడుగ్రామ సచివాలయంనం దు శుక్రవారంజాతీయ కాలుష్య నియంత్రణ దినోత్స వం" సందర్భంగా "స్వచ్ఛ సంకల్పం"కార్యక్రమాన్ని గు ణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్ వారు పాతపాడు మహిళా పోలీస్ మేడూరి సజినీ రాణి ఆధ్వర్యంలోఘ నంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగాపాతపాడు గ్రామ ఉపసర్పంచ్ మ రీదు స్వప్న, నున్న పోలీస్ స్టేషన్ఎస్సైహైమావతి, పా తపాడు ఈఓ చెన్నకేశవ రావు, గుణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ కాటూరి రమేష్ పాల్గొ న్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫౌండేషన్ వారు పాతపాడు పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులకు " కాలుష్యంమరియు నో ప్లాస్టిక్ అంశాలనుద్దేశించి వి విధ డ్రాయింగ్ఎలోక్యూషన్ పోటీలునిర్వహించారుబీ అలాగే, గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ నిషేధించి లిగుడ్డ సం చులు తయారు చేయుట మరియు తడి-చెత్త పొడి-చెత్త వేరుచేసి పంచాయతీ వాహనంలో వేయు టవం టి పోటీలనులి ఫౌండేషన్ వారు నిర్వహించి, గెలుపొందునవారందరికి అతిథులచేతులమీదుగా బహు మ తులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ స్కిట్లుపాటలుమరియు డాన్స్ రూపాలలో గ్రా మ ప్రజలకు ప్లాస్టిక్ వాడకూడదని వాటివల్ల పర్యా వరణ కాలుష్యం ఏర్పడి మనము మరియు మన భా వి తరాలు ఎదురవుతాయని, గుడ్డ సంచులు వాడాల ని అవగాహన కలిగించారుతదుపరి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథులు మాట్లాడుతూ..ఇంత చక్కని కార్యక్రమా న్ని చేయాలన్న సంకల్పన్ని, విద్యార్థుల్లోనుంచి, మరి యు గ్రామ ప్రజలలోనుంచి వారి నైపుణ్యతను గు ర్తించి వెలికి తీసిన గుణాదిత్య ఇంటిగ్రల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కాటూరి రమేష్ ని ప్రశంసించి కొ ని యాడారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగా ల ని, సమాజానికి ఎంతో అవసరమనిపేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాలల ఉపాధ్యాయులు జయం తి, జ్యోతి, మనోజ, మణికంత, శ్రీను, సచివాలయం సిబ్బంది మరియు గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొ న్నారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



గన్నవరం,ప్రజపాలన ప్రతినిధి డిసెంబర్ 3:బాపులపాడు మండలం లోని వీరవల్లి గ్రామంలో మండల పరిషత్ పాఠశాల నందు గల భవిత కేంద్రం నందు దివ్యంగుల దినోత్సవం సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరవల్లి గ్రామ సర్పంచ్ పిళ్ళా అనిత గారు మాజీ సర్పంచ్ పిళ్ళా రామారావు గారు జెడ్ పి హెచ్ హెచ్ ఎం పి నిర్మల ఎంపీపీ వీరవల్లి పాఠశాల ఉపాధ్యాయులు అంజనా దేవి గారు ప్రత్యేక ఉపాధ్యాయులు కె సుశీల, జె నాగమణి పి చంద్రకళ సి ఆర్ పి వేలంగిని మాత ఎస్ఎంసి చైర్మన్ ఎం అంజి బాబు గారు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగింది మరియు ఈ కార్యక్రమం అనంతరం అందరికీ స్నాక్స్ మరియు అల్పాహారం అందించడం తో ఈ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగింది.

# కొత్త కూటమిలో తెలుగు సీఎంలు



ఉభయ తెలుగు రాష్ట్రాలలో రాజకీయం కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్త మలుపులు తీసుకుంటోంది. ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకుంటారు, ఎవరు ఎవరితో చేతులు కలుపుతారు, అనేది ఎవరికీ అంతు చిక్కని వింత రాజకీయంగా కనిపిస్తోంది. గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ అనేది నిన్నటివరకు, బీజేపీ-తెరాస సంబంధాలకు సంబదింఛి కాంగ్రెస్ ప్రయోగించిన స్లోగన్. అయితే, ఈరోజు అదే స్లోగన్ కొత్తగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్-తెరాసల మధ్య బలపడుతున్న సంబంధ బాంధవ్యాలకు కూడా అతికినట్లు సరిపోతుందని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. బీజేపీ-తెరాస చీకటి సంబంధాలకు ఎలాగైతే ప్రత్యక్ష ఆధారాలు లేవో అలాగే, కాంగ్రెస్-తెరాస కొత్త ప్రేమకు కూడా, పెద్దగా ఆధారాలు లేవు. కాంగ్రెస్ సహా వివిధ పార్టీలకు చెందిన 12 మంది పెద్దల సభ సభ్యుల సస్పెన్షన్ కు వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్ ప్రాంగణంలో గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నాయి. పార్లమెంట్ లో బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనుసరించవలసిన వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్ష పార్టీలు ప్రతి రోజు సమావేశం కావడం గత ఒకటి రెండు సెషన్లగా ఆనవాయితీ వస్తోంది. అయితే ఇంతవరకు ఈ సమావేశాలకు ఎప్పుడు హాజరు కాని, తెరాస పార్లమెంటరీ పార్టీ తొలిసారిగా పాల్గొంది. తెరాస పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవ రావు, మరో ఇద్దరు ఎంపీలు ధర్నా కార్యక్రమంలో పాల్గొనారు. కేశవ రావు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పక్కనచేరి ప్రేమగా ముచ్చట్లు చెప్పుకున్నారు. అందులోంచి, కాంగ్రెస్-తెరాస కొత్త స్నేహం కథ పుట్టుకొచ్చింది. కాంగ్రెస్ సారధ్యంలో సాగుతున్న అపోజిషన్ ఆందోళనకు ఇంతవరకు దూరంగా ఉండి బుధవారం ఎంట్రీ ఇచ్చింది, ఒక్క తెరాస మాత్రామే కాదు, సస్పెండ్ అయిన సభ్యుల్లో ఇద్దరు తమ పార్టీ సభ్యులు ఉన్నా, సోమ మంగళ వారాలలో అపోజిషన్ ఆందోళనలకు దూరంగా ఉన్న తృణమూల్ కూడా బుధవారం ఎంట్రీ ఇచ్చింది. నిజానికి, పార్లమెంట్'లో జరిగే ఉమ్మడి ఆందోళనకు, రాష్ట్రాలలో రాజకీయ శతృమిత్ర సంబంధాలకు ఎలాంటి సంబంధం లేదని, అక్కడ రాష్ట్రాలలో కొట్టుకున్నా, తిట్టుకున్నా పార్లమెంట్'లో మాత్రం ఉమ్మడి శత్రువు (బీజేపీ)ను ఉమ్మడిగా ఎదుర్కుందామని, ఈ సమావేశాలకు నయుకత్వం వహిస్తున్న రాజ్యసభలో కాంగ్రెస్ పక్షనేత మల్లికార్జున ఖర్గే స్పష్టంగా చెప్పారు. అంటే తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే, అనేది ఖర్గే చెప్పిన, అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. ఢిల్లీ నుంచి ముంబై వెళితే, అసలు రాజకీయం అక్కడ కనిపిస్తుంది. దేశంలో బీజేపీకి ప్రత్యాన్మాయంగా బలమైన ఫ్రంట్'ను ఏర్పాటుచేసే ప్రయుత్నాలలో ఉన్న, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మమతా బెనర్జీ ముంబై వెళ్లారు. ఎన్సీపీ అధినేత శరద్ పవార్'తో సమావేసమయ్యారు. ఆతర్వాత ఇద్దరు కల్సి మీడియా ముందుకు వచ్చి, ,గతంలో కాంగ్రెస్ సారధ్యంలో దేశాన్ని పదేళ్ళు పాలించిన యుూపీఏ ఇక లేదు ...అని గంభీరంగా ప్రకటించారు. సో ..కాంగ్రెస్ సహా బీజేపీ వ్యతిరేక పార్టీలు అన్నటికీ తమ కొత్త కూటమి స్వాగతం పలుకుతోందని అన్నారు. అంటే, బీజేపే వ్యతిరేక కూటమి సారధ్యం నుంచి కాంగ్రెస్ పార్టీని పక్కకు తప్పించి, ఉమ్మడి నాయకత్వం పేరిట కొత్త ఫ్రంట్ ఏర్పాటు చేసి చక్రం తిప్పేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు, అని అర్థం చేసుకోవచ్చును. నిజానికి కొంచెం అటూ, ఇటూ తిప్పినా ఆమె అదే విషయం చెప్పారు. అక్కడ కట్ చేసి తెలుగు రాష్ట్రలకు వస్తే, జాతీయ స్థాయిలో సాగుతున్న ఈ మొత్తం పొలిటికల్ డ్రామా సూత్రధారి, ఎన్నికల వ్యూహ కర్త ప్రశాంత్ కిశోర్, ఏపీలో అధికార వైసీపీతో ఇప్పటికే డీల్ కుద్రుచుకున్నారు. అ విషయం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎప్పుడోనే మంత్రివర్గ సమావేశంలోనే ప్రకటించారు. . తెలంగాలో జగన్ రెడ్డి సోదరి, వైఎస్ షర్మిల పార్టీ వైఎస్సార్ టీపీతో డీల్ కుదుర్చుకున్నారు. ఆ విషయం, మనసు విప్పి మాట్లాడే 'ఆర్కే ఓపెన్ హార్ట్' కార్యక్రమంలో షర్మిల స్వయంగా చెప్పారు. ఇప్పుడు తాజాగాగా పీకే. కేసీఆర్ తో డీల్ కుదుర్చుకున్నారని అంటున్నారు ...అలాగే, కాంగ్రెస్ తో తెగతెంపులు చేసుకున్నా,కాంగ్రెస్'ను కూడా బీజేపే వ్యతిరేక కూటమిలోకి తెచ్చే ప్రయత్నాలు మాత్రం విరమించుకోలేదు. సో .. రెండు రోజుల్లో కొలకటా టూ ఢిల్లీ టూ హైదరాబాద్ .. వయా ముంబై .. సాగిన పొలిటికల్ జర్నీ 'డాట్స్' కలుపుకుంటే, అసలు బొమ్మ బయటకు వస్తుంది. ఇప్పటికిప్పుడు ఏమీ జరగక పోవచ్చును కానీ, చివరకు, ఎన్నికల నాటికి, బీజేపీ వ్యతిరేక పార్టీలు అన్నీ మమతా-పవార్ ఫ్రంట్ వైపు ర్యాలీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే, తెరాస ఆ కూటమిలో చేరితే కాంగ్రెస్ ఎటుంటుంది ? మమతా బెనర్జీ నాయకత్వాన్ని అంగీకరించి, బీజేపీ వ్యత్రిరేక కూటమిలో చేరుతుందా? మరో కూటమిని ఏర్పాటు చేస్తుందా? ఏమి జరుగు తుంది? అదొక మిలయున్ డాలర్ల ప్రశ్న. తెలంగాణలో తెరాస తృణమూల్ కూటమిలో చేరితే కాంగ్రెస్ ఏమి చేస్తుంది, అనేది మరో మిలయన్ డాలర్ల ప్రశ్న. కాంగ్రెస్ పార్టీ ఐడెంటిటీని కాపాడుకునేందుకు థర్డ్ ఫ్రంట్'గా ఏర్పడినా, అల్టిమేట్'గా బీజేపీ వ్యతిరేక శక్తులు అన్నీ, అది కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ, వైసీపీ అయినా చివరకు తెరాసనే అయినా, చేరేది ఒకటే గూటికి అందులో సందేహం లేదు.

## ఆన్ లైన్ లోన్లతో... జర భద్రం




ముంబై, డిసెంబర్ 3, : కొన్ని మొబైల్ యాప్‌లు ఆన్‌లైన్‌లో ఇచ్చే లోన్లతో కస్టమర్ల జేబులు గుల్ల అవుతున్నాయనే కంప్లైంట్లు ఎక్కువయ్యాయి. విపరీతమైన వడ్డీలు, మోసపూరితంగా చార్జీలను వసూలు చేస్తున్నారని, కిస్తీలు లేటైతే బారోవర్లను వేధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ఆర్‌బీఐ అప్రమత్తమైంది. ఇల్లీగల్ యాప్‌లు లోన్లు ఇవ్వకుండా చర్యలు తీసుకుంటోంది. మనదేశంలో దాదాపు 1,100 ఆన్‌లైన్ లోన్ యాప్‌లు ఉన్నాయని వెల్లడించింది. మరో సంగతి ఏమిటంటే దాదాపు 80 ఆండ్రాయిడ్ స్టోర్లలోని ఈ యాప్‌లలో దాదాపు 600 వరకు చట్టవిరుద్ధమేనవే! ఇలాంటి లెండింగ్ యాప్‌లను కంట్రోల్ చేయడానికి ఆర్‌బీఐ వర్కింగ్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఇలాంటి స్కామ్‌లను నిరోధించడానికి ఈ యాప్‌లకు వెరిఫికేషన్‌కు తప్పనిసరి చేయాలని సిఫార్సు చేసింది. కిస్తీలను వసూలు చేయడానికి డిజిటల్ యాప్‌లు అక్రమపద్ధతులను అనుసరించడం, వేధించడం, విపరీతమైన వడ్డీలను చేయడంతో ఆర్‌బీఐ ఈ కమిటీని ఏర్పాటు చేసింది. డిజిటల్ లోన్లలో స్కామ్‌లే ఎక్కువని ఫైనాన్షియల్ ఎక్స్‌పర్టులు చెబుతున్నారు. కాబట్టి డీఎల్‌ఏల నుంచి, డిజిటల్ లోన్ యాప్‌ల నుండి లోన్లు తీసుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి.'ప్రొసీడ్' బటన్‌పై క్లిక్ చేసే ముందే లోన్ రూల్స్‌ను పూర్తిగా చదివి అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం. ఇది అన్నిటికీ ముఖ్యమైనది. డిజిటల్ లోన్ యాప్‌ల రూల్స్ తెలుసుకోవడం చాలా ఇంపార్టెంట్. ఒక నిర్ణయానికి వచ్చే ముందు రూల్స్‌ను, షరతులను పూర్తిగా చదవాలి. లేకపోతే ప్రమాదంలో చిక్కుకునే అవకాశాలు ఉంటాయిటెక్నాలజీ వాడకం పెరగడం వల్ల లోన్ల స్కామ్‌లు పెరిగాయి. సైబర్ నేరాలూ ఎక్కువయ్యాయి. రెగ్యులేటర్ల అప్రూవల్ లేని లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలి. బ్యాంక్ వివరాలు, క్రెడిట్ కార్డ్ పిన్ లేదా అడ్రస్‌ల వంటి వ్యక్తిగత వివరాలను అడిగే డిజిటల్ లోన్ యాప్‌ల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి. రూల్స్ ప్రకారం నడుచుకునే లోన్ యాప్‌లు ఇలాంటి సున్నితమైన సమాచారం అడగవుతక్కువ వడ్డీ రేట్ల ఉన్నాయి కదా అని హడావుడిగా లోన్లు తీసుకోవద్దు. కొన్ని యాప్‌లు వడ్డీరేట్లను తక్కువగా చూపినా.. ప్రీ-పేమెంట్ ఛార్జీలు, ప్రాసెసింగ్ ఫీజులు లేదా ప్రీ-క్లోజర్ ఛార్జీల పేరుతో భారీగా వసూలు చేస్తాయి. ఇలాంటి యాప్‌లకు దూరంగా ఉండటమే మేలు.ఆర్‌బీఐ రూల్స్‌ను పాటించే నమ్మకమైన డిజిటల్ లోన్ యాప్‌లకు వెబ్‌సైట్లు ఉంటాయి. స్కామర్ల యాప్‌లకు సాధారణంగా వెబ్‌సైట్ కూడా ఉండదు. వాటిలో కొన్ని లిస్ట్ అయి కూడా ఉంటాయి. అయినప్పటికీ ఇవి స్కామర్ల చేతుల్లో లేవని రూఢీ చేసుకోవడానికి వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలి. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు యాప్ స్టోర్‌లో యాప్ రివ్యూలను కూడా చదవాలి. లోన్ ఇచ్చే యాప్ ఏదైనా నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీతో కలిసి పనిచేస్తుందో లేదో చూడాలి. అది ఆర్‌బీఐ లేదా బ్యాంక్‌లో రిజిస్టర్ అయిన ఎన్‌బీఎఫ్‌సీయా కాదా ? అనేది చెక్ చేయాలి. అవసరమనుకుంటే సంబంధిత ఎన్‌బీఎఫ్‌సీ ఆఫీసుకు వెళ్లి సమాచారం కనుక్కోవాలి.మీకు లోన్ ఇస్తున్న యాప్/లెండర్ ఆర్‌బీఐలో రిజిస్టర్ అయిందో లేదో తప్పనిసరిగా తెలుసుకోవాలి. సంబంధిత యాప్/క్రెడిటర్ ఎంతవరకు నమ్మకస్తుడో చూడాలి. పేరున్న కంపెనీ అయితే లోన్ తిరిగి చెల్లించేటప్పుడు ఎటువంటి సమస్యలూ ఉండవు. అడ్డగోలు చార్జీలు ఉండవు. ఆర్‌బీఐ కేవైసీ రూల్స్‌ను పాటించని యాప్‌లకు దూరంగా ఉండాలి. ఇవి సెంట్రల్ బ్యాంక్ మార్గదర్శకాలను పాటించవు.


## కాంగ్రెస్‌కు జీరో, బీజేపీకి ఉద్వాసన: అఖిలేష్

ఝాన్సీ: ఉత్తరప్రదేశ్ ప్రజలు త్వరలోనే ప్రభుత్వాన్ని మార్చనున్నారని, యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఆయా ప్రదేశాలకు పేర్లు మార్చడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. బీజేపీని జనం తిరస్కరించనున్నారనీ, కాంగ్రెస్‌కు వచ్చేవి జీరో సీట్లేనని జోస్యం చెప్పారు. ఝాన్సీలో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో అఖిలేష్ మాట్లాడుతూ, యూపీలోని యువత, రైతులు, వ్యాపారులు యోగి ప్రభుత్వాన్ని వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్టు చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతులకు మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.సమాజ్‌వాదీ పార్టీ 22 నెలల్లో ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించినప్పుడు, అదే పనికి బీజేపీ నాలుగున్నరేళ్లు ఎందుకు తీసుకుందని అఖిలేష్ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడాలనే కోరిక వాళ్లకు లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నిరాకరించారని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ ఖాతా కూడా తెరవదని పేర్కొన్నారు.

## తారక మంత్రమే పరిష్కారం

హైదరాబాద్, డిసెంబర్ 3, :గత ఎన్నికల నుంచి తెలుగుదేశం పార్టీలో తారక మంత్రం ఎక్కువగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. తెలుగుదేశం పార్టీ పగ్గాలు ఎన్టీఆర్‌కు అప్పగించాలని ప్రచారం హోరెత్తెత్తున్న విషయం తెలిసిందే. టీడీపీ భారీ ఓటమి, చంద్రబాబుకు వయసు మీద పడటం, లోకేష్‌కు పార్టీని నడిపించే సామర్థ్యం లేకపోవడంతో?జూనియర్ ఎన్టీఆర్ పార్టీలోకి వచ్చి పార్టీ పగ్గాలు చేపట్టాలని?ఎన్టీఆర్ అభిమానులే కాదు?టీడీపీలో కొంతమంది కార్యకర్తలు కోరుకుంటున్నారు. అలాగే ప్రత్యర్థి పార్టీలో ఉన్న వాళ్ళు కూడా టీడీపీ నిలబడాలంటే ఎన్టీఆర్ రావాల్సిందే అని అంటున్నారు.అయితే చంద్రబాబుకు ఇంకా వయసు ఉంది?ఆయన ఉన్నంతకాలం టీడీపీ పగ్గాలు ఎవరు చేతుల్లోకి వెళ్లవని, ఆయనే పార్టీని ముందుకు తీసుకెళ్తారని టీడీపీ నేతలు అంటున్నారు. టీడీపీ నేతలు చెప్పిన మాట నిజమే అని చెప్పాలి?చంద్రబాబు స్టామినా తగ్గలేదు..ఆయనకు పార్టీని నడిపించే సత్తా ఉంది. గత ఎన్నికల్లో ఘోర ఓటమి నుంచి పార్టీని చాలావరకు బయటపడేయడానికి చూస్తున్నారు.ఈ రెండున్నర ఏళ్లలో వైసీపీని తట్టుకుని పార్టీని నిలబెట్టారంటే మామూలు విషయం కాదనే చెప్పాలి. అయితే ఇప్పుడున్న పరిస్తితుల్లో ఎన్టీఆర్ అవసరం అంతగా రాకపోవచ్చు..కానీ ఫ్యూచర్‌లో మాత్రం ఎన్టీఆర్ అవసరం ఉందని, ఎందుకంటే జనాలని ఆకర్షించే శక్తి తారక్‌కు ఉందని, అలాగే టీడీపీకి దూరంగా ఉన్న యువ ఓటర్లని ఆకర్షించగలరని, ఎన్టీఆర్‌కు జనంలో కలిసిపోయే సత్తా ఉందని, ఎన్టీఆర్‌కు మాస్ పల్స్ తెలుసని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## డెల్టాకంటే ఆరు రెట్ల వేగంగా.. ఒమిక్రాన్




న్యూఢిల్లీ, డిసెంబర్ 3, :నవంబర్ ప్రారంభంలో, దక్షిణాఫ్రికాలోని గౌటెంగ్ రాష్ట్రంలోని కరోనా ల్యాబ్‌లో ఒక ప్రత్యేక విషయాన్ని గమనించారు నిపుణులు. వారు అక్కడ కరోనా వైరస్ కు సంబంధించిన ఒక జన్యువును గుర్తించలేకపోయారు. ఈ తప్పిపోయిన జన్యువులు స్పైక్ ప్రోటీన్‌లను తయారు చేస్తాయి. ఇవి మానవ కణాలలో సూక్ష్మక్రిములను ప్రవేశించేలా చేసి వ్యాప్తి చేస్తాయి. అదే సమయంలో, తలనొప్పి, అలసటతో ఫిర్యాదు చేసే రోగులతో ఆ ప్రాంతం నిండిపోయింది.నవంబర్ 15 నాటికి, గ్వాటెంగ్ ప్రావిన్స్ నుండి 77 నమూనాలు తీసుకున్నారు. వాటిని క్రమం చేశారు. క్షుణ్ణంగా పరిశోధన చేసిన తర్వాత, ఇది కరోనా వైరస్‌కి సంబంధించిన కొత్త వైవిధ్యమని నిపుణులు నిర్ధారణకు వచ్చారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ కొత్త వేరియంట్‌కి ః.1.1.529 అని పేరు పెట్టింది. దీనిని వాడుకలో ఒమిక్రాన్ గా పిలిచేలా పేరుపెట్టారు. నవంబర్ 26న ఇది ఆందోళనకరమైన వేరియంట్‌గా ప్రకటించారు. అప్పటి నుండి ఈ కొత్త వేరియంట్ 15 కంటే ఎక్కువ దేశాలలో కనిపించింది.సులభమైన భాషలో కరోనా కొత్త రూపాంతరం ఆవిష్కరణ వెనుక ఉన్న శాస్త్రాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. అలాగే, ఒమిక్రాన్ వేరియంట్‌కి సంబంధించిన కొన్ని ఇతర ముఖ్యమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ప్రయుత్నిస్తుంది? తెలుసుకునే ప్రయుత్నం చేద్దాం.వేరియంట్ హంటింగ్ అంటే వైరస్ కొత్త వైవిధ్యాలను కనుగొనే ప్రక్రియ కూడా చాలా ఉత్తేజకరమైనది. ఇది తెలుసుకునే ముందు మనం జీన్స్, జీనోమ్స్ అదేవిధంగా జీనోమ్ సీక్వెన్సింగ్‌ని అర్థం చేసుకోవాలి?ప్రపంచంలోని ప్రతి జీవి నిర్మాణం దాని జన్యువుల ద్వారా నిర్ణయం అవుతుంది. మీ ముఖం మీ తల్లి లేదా తండ్రిని పోలి ఉంటుందని చాలా సార్లు మీ పక్కనున్న వారు మీకు చెప్పి ఉంటారు. మీ శరీరంలోని కొన్ని జన్యువులు మీ తల్లిదండ్రులతో సరిపోలుతాయని దీని అర్థం.జీనోమ్ అంటే ఒక జీవికి సంబంధించిన పూర్తి జన్యు సంకేతం. ఈ భూమిపై ఉన్న ప్రతి జీవి జన్యువు భిన్నంగా ఉంటుంది. కొన్ని రెండు జీవులు కొన్ని జన్యువులను ఒకేలా కలిగి ఉండవచ్చు, కానీ వాటి జన్యు సంకేతంమాత్రం ఒకేలా ఉండదు.జీవి జన్యువు నిర్మాణం చాలా క్లిష్టంగా ఉంటుంది. దీన్ని అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు దానిని కోడ్‌గా మార్చారు. ఈ కోడ్‌ను కనుగొనే సాంకేతికతను జీనోమ్ మ్యాపింగ్ లేదా జీనోమ్ సీక్వెన్సింగ్ అంటారు. సాధారణ భాషలో, జీనోమ్ సీక్వెన్సింగ్ అనేది ఒక జీవికి సంబంధించిన ఒక రకమైన బయోడేటా. దీని నుండి, దాని రంగు రూపాన్ని అలాగే ప్రవర్తనను గుర్తించవచ్చు. కరోనా వైరస్ అన్ని రకాల జన్యు సంకేతాలు స్థిరంగా ఉన్నాయి.ప్రపంచవ్యాప్తంగా వైరస్ నమూనాల జీనోమ్ సీక్వెన్సింగ్ కొనసాగుతోంది. సీక్వెన్సింగ్ సమయంలో, వేరియంట్ జీనోమ్ కోడ్‌లో కొన్ని మార్పులు కనిపిస్తాయి. దాని నుండి కొత్త వైవిధ్యాలు కనుగొంటారు.. దక్షిణాఫ్రికాలో జీనోమ్ సీక్వెన్సింగ్ సమయంలో వైరస్‌లో కొన్ని ప్రధాన మార్పులు కనిపించాయి. నవంబర్ 4న, లాన్సెట్‌లోని జూనియర్ సైంటిస్ట్ అలీసియా వెర్మెలెన్ ఓమిక్రాన్ నుండి ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. సింగిల్ పాజిటివ్ టెస్ట్‌లో ఏదో తప్పుగా గుర్తించి మేనేజర్‌కి సమాచారం అందించారు.లాన్సెట్ మాలిక్యులర్ పాథాలజీ చీఫ్ అల్లిసన్ గ్లాస్ ఒక వారం పాటు ఇలాంటి అసాధారణ విషయాలను చూసిన తర్వాత ఈ విషయాన్ని నివేదించారు. దీని తరువాత, లాన్సెట్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ కమ్యూనికేబుల్ డిసీజెస్ సహకారంతో, వాటిని లోతుగా పరిశీలించినప్పుడు, అందులో ఒక జన్యువు కనిపించలేదు. వాస్తవానికి, అనేక ఉత్పరివర్తనాల కారణంగా, ఈ జన్యువు పట్టుబడలేదు. ఒమిక్రాన్ వేరియంట్ ను అప్పుడు గుర్తించారు.దక్షిణాఫ్రికా ఆరోగ్య శాఖ తాత్కాలిక డైరెక్టర్ జనరల్, నికోలస్ క్రిస్ప్, నవంబర్ 24న మొదటిసారిగా ఈ వేరియంట్ గురించి తెలియజేశారు. ఈ సమాచారం మరుసటి రోజే ఇతర ప్రభుత్వ ముఖ్య అధికారులకు అందింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో, దక్షిణాఫ్రికాలోని 2 జీనోమ్ సీక్వెన్సింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల అధిపతి తులియో డి ఒలివెరా కొత్త వేరియంట్ గురించి అధికారిక ప్రకటన చేశారు. నవంబర్ 26 న, ప్రపంచ ఆరోగ్య సంస్థ దీనిని ఆందోళనకర వైవిధ్యంగా ప్రకటించింది.భారత ప్రభుత్వం 25 డిసెంబర్ 2020న కరోనా జన్యు శ్రేణి కోసం ఒక ఫోరమ్‌ను రూపొందించింది. దీనికి అని పేరు పెట్టారు, అంటే ఇండియన్ కన్సార్టియం ఆన్ జెనోమిక్స్. ఇది దేశవ్యాప్తంగా ఉన్న జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌ల కన్సార్టియం వలె పనిచేస్తుంది. దీని కింద దేశవ్యాప్తంగా 10 లేబొరేటరీలు పనిచేస్తున్నాయి.రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్నవారిలో వైరస్ ఎక్కువ కాలం ఉంటుందని ఒక నమ్మకం. వారి శరీరం వైరస్‌ను పూర్తిగా నిర్మూలించదు. వారి శరీరం రోగనిరోధక శక్తి కారణంగా, వైరస్ చనిపోదు, కానీ మరింత అభివృద్ధి చెందుతుంది. ఇది కాకుండా, కొత్త వైవిధ్యాలను గుర్తించే వైరస్ వ్యాప్తి, పర్యవేక్షణపై దక్షిణాఫ్రికా నిశితంగా గమనిస్తోందని కూడా నమ్ముతారు.ఒమిక్రాన్ డెల్టా వేరియంట్ కొడుకు లేదా మనవడు కాదని, కొత్త రకం వైరస్ అని నిపుణులు భావిస్తున్నారు. దీని స్పైక్ ప్రోటీన్ 30 ఉత్పరివర్తనాలను కలిగి ఉంది. ఈ రూపాంతరం ప్రొఫైల్ ఇప్పటికే ఉన్న జాతికి భిన్నంగా ఉంటుంది. ఇది ఎంత ప్రమాదకరం.. అదేవిధంగా ఎంత పెద్ద అంటువ్యాధి అనే దానిపై అధ్యయనాలు జరుగుతున్నాయి. డెల్టా వేరియంట్ కంటే 6 రెట్లు ఎక్కువ వేగంగా ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెందుతుందని కొందరు నిపుణులు భావిస్తున్నారు.





## మలయాళ నాట 'మరక్కార్' మాటేమిటో?!




మలయాళనాట విభిన్నమైన కథలకు .. విలక్షణమైన పాత్రలకు కేరాఫ్ అడ్రెస్ గా మోహన్ లాల్ పేరు చెబుతారు. వైవిధ్యభరితమైన కథలకు .. ప్రయోగాత్మకమైన పాత్రలకు ప్రాధాన్యతనిస్తూ ఆయన తన జోరును కొనసాగిస్తున్నారు. యంగ్ స్టార్ హీరోలు కూడా ఆయనతో పోటీపడలేకపోతున్నారు. అలాంటి మోహన్ లాల్ తన తాజా చిత్రంగా 'మరక్కార్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. 100 కోట్ల బడ్జెట్ తో .. భారీ తారాగణంతో ఈ సినిమా నిర్మితమైంది. ప్రియదర్శన్ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. 16వ శతాబ్దానికి చెందిన ఒక కేరళ పోరాట యోధుడి కథ ఇది. కుంజాలి మరక్కార్ అనే ఒక యోధుడి జీవితంలోని ఒక కోణం ఇది. కేరళ తీర ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తీసుకురావడానికి ప్రయత్నించిన పోర్చుగీసువారిని మరక్కార్ ధైర్యసాహసాలతో ఎదురిస్తాడు. ఫలితంగా తన కుటుంబ సభ్యులను కోల్పోతాడు. పోర్చుగీసువారి బారి నుంచి తప్పించుకున్న మరక్కార్ రహస్య జీవితంలోకి వెళ్లిపోతాడు. తిరిగి ఆయన తన బలాన్ని ఎలా కూడగట్టుకున్నాడు? పోర్చుగీసువారిపై ఎలా ప్రతీకారం తీర్చుకున్నాడు? అనేదే కథ. ఈ సినిమా నిర్మాణ సమయం నుంచే మలయాళంలో ఈ సినిమాను 'బాహుబలి'తో పోల్చారు. ఆ స్థాయి సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమా రూపొందుతున్నట్టుగా చెప్పారు. మోహన్ లాల్ .. సునీల్ శెట్టి .. ప్రభు .. కీర్తి సురేశ్ .. సుహాసిని .. మంజు వారియర్ వంటి తారాగణం కారణంగా ఈ సినిమాపై అందరిలో అంచనాలు ఏర్పడ్డాయి. కాస్ట్యూమ్స్ పరంగా కూడా ఈ సినిమా ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. మలయాళంలోనే కాదు తెలుగు .. తమిళ .. కన్నడ .. హిందీ భాషా ప్రేక్షకులు కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తితో ఎదురుచూశారు. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిని అందుకోలేకపోయిందనే టాక్ బలంగా వినిపిస్తోంది. ప్రియదర్శన్ గొప్ప దర్శకుడే అయినప్పటికీ ఈ సినిమా కథాకథనాలపై ఆయన అంతగా దృష్టి పెట్టలేదని చెప్పుకుంటున్నారు. స్క్రీన్ ప్లే లోపం కారణంగా కథలో కొంత గందరగోళం కనిపిస్తోందని అంటున్నారు. ఏ పాత్రకి ఒక ప్రత్యేకత లేకపోవడం .. ఆ పాత్రలని సరిగ్గా రిజిస్టర్ చేయకపోవడం .. పాత్రల సంఖ్య ఎక్కువ కావడం .. వాటిని అర్థమయ్యేలా పరిచయం చేయకపోవడం వలన .. సగటు ప్రేక్షకుడికి ఈ సినిమా అయోమయాన్ని కలిగిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి ఆర్టిస్టులను ఎంచుకున్నప్పటికీ వాళ్లని సరిగ్గా ఉపయోపగించుకోలేదని చెప్పుకుంటున్నారు. మోహన్ లాల్ – ప్రియదర్శన్ కాంబినేషన్ గనుక వసూళ్ల పరంగా అయితే ఆలోచించనవసరం లేదు. కాకపోతే మరికాస్త శ్రద్ధ పెట్టి ఉంటే ఈ సినిమా మరో స్థాయిలో ఉండేదనే అంటున్నారు.

## భీమ్లా నాయక్" నుంచి కూడా అప్డేట్ రాబోతోందా?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు రానా దగ్గుబాటిలు ప్రధాన పాత్రల్లో నటించిన క్రేజీ మల్టీ స్టారర్ మాస్ మూవీ "భీమ్లా నాయక్". మాస్ ఆడియెన్స్ లో మంచి అంచనాలు నెలకొల్పుకున్న ఈ చిత్రం నుంచి కూడా ఇటీవల రావాల్సిన ఓ అప్డేట్ పలు కారణాల చేత వాయిదా పడింది. అదే ఈ సినిమా నుంచి కొత్త సాంగ్. "అడవి తల్లి మాట" అంటూ సాగే ఈ సాంగ్ పై మంచి బజ్ ని ఈ సాంగ్ సంతరించుకుంది. అయితే అప్పుడు వాయిదా పడింది అని చెప్పిన మేకర్స్ మళ్ళీ దీనిపై ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. దీనితో అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ అప్డేట్ ని కూడా మేకర్స్ అనౌన్స్ చెయ్యబోతున్నట్టు తెలుస్తుంది. ఇంకో పక్క "ఆర్ఆర్ఆర్" ట్రైలర్ డేట్ కోసం కూడా అంతా ఎదురు చూస్తున్నారు. మరి ఈ రెండు అప్డేట్స్ ఈరోజు వస్తాయా రేపు వస్తాయా అనేది చూడాలి.

## టాప్ ప్రొడక్షన్ హౌస్ ఓటీటీ ఎంట్రీ





కరోనా కారణంగా ఇండియాలో ఓటీటీ మార్కెట్ విపరీతంగా పెరిగింది. అయిదు ఆరు ఏళ్ల తర్వాత ఓటీటీ మార్కెట్ ఈ రేంజ్ కు పెరుగుతుందని మార్కెట్ వర్గాల వారు అంచనా వేశారు. కాని కరోనా వల్ల థియేటర్లు మూత పడటం.. జనాలు ఎంటర్ టైన్ మెంట్ కోసం ఓటీటీలను ఆశ్రయించడం.. సినిమాల నిర్మాతలు థియేటర్లు మూత పడటం వల్ల తమ సినిమాలను వదిలించుకునేందుకు ఓటీటీలను ఆశ్రయించడం చేశారు. దాంతో ఓటీటీలకు ఇండియాలో ఆధరణ అమాంతం పెరిగింది. ప్రస్తుతం స్టార్ హీరోల నుండి చిన్న నటీ నటుల వరకు ప్రతి ఒక్కరు కూడా ఓటీటీ కంటెంట్ పై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రముఖ దర్శకులు కూడా ఓటీటీ కంటెంట్ ను క్రియేట్ చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. భాష తో సంబంధం లేకుండా దేశ వ్యాప్తంగా కూడా ఓటీటీ లు పెద్ద ఎత్తున వెబ్ సిరీస్ లను మరియు వెబ్ మూవీస్ ను అందిస్తున్నాయి. ఈ సమయంలో బాలీవుడ్ ప్రముఖులు పలువురు ఓటీటీ ఎంట్రీకి సిద్దం అయ్యారు. ఇదే సమయంలో బాలీవుడ్ స్టార్ ఫిల్మ్ మేకింగ్ సంస్థగా పేరు దక్కించుకున్న యశ్ రాజ్ సంస్థ వారు కూడా ఓటీటీ ఎంట్రీకి సిద్దం అయ్యారు. యశ్ రాజ్ సంస్థలో ఎన్నో వందల సూపర్ హిట్ సినిమాలు వచ్చాయి. ఆ సినిమాల్లో ఎన్నో ఎప్పటికి నిలిచి పోయే ఆణిముత్యాలు.. క్లాసిక్ మూవీస్ కూడా ఉన్నాయి. ఎంతో మంది హీరోలను స్టార్స్ గా సూపర్ స్టార్స్ గా చేసిన ఘనత ఈ సంస్థకు దక్కింది అనడంలో సందేహం లేదు. ఈ సంస్థ ఇప్పుడు ఓటీటీ ఎంట్రీకి సిద్దం అయ్యింది. 'ది రైల్వే మ్యాన్' అనే సినిమా తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. నేడు యశ్ రాజ్ సంస్థ ఈ సినిమాను ప్రకటించి.. సరిగ్గా వచ్చే ఏడాది ఇదే రోజున ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లుగా ప్రకటించారు. అయితే ఏ ఓటీటీ లో ఈ సినిమా స్ట్రీమింగ్ అవ్వబోతున్న విషయం ను క్లారిటీ ఇవ్వలేదు. 1984 లో జరిగిన భోపాల్ గ్యాస్ లీకేజ్ సంఘటన ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లుగా టైటిల్ లోనే పేర్కొన్నారు. ఇలాంటి వివాదాస్పద.. సున్నిత విషయాలను థియేట్రికల్ సినిమాల ద్వారా చూపించడం కాస్త ఇబ్బందికర విషయం. అందుకే ఈ సినిమా ను ఓటీటీ ద్వారా తీసుకు వస్తే ఎక్కువ మందికి చేరువ అవుతుందని అంటున్నారు. మాధవన్.. కయ్ కయ్ మీనన్.. దివ్యేందు.. ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ ఖాన్ లు ఈ సినిమా లో కనిపించబోతున్నారు. శివ్ రావల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈవెబ్ మూవీని 2022 డిసెంబర్ 2న స్ట్రీమింగ్ చేయబోతున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు.

## శ్రద్ధా లవ్ లీ స్మైల్ కి పడిపోవాల్సిందే!



ముంబై బ్యూటీ శ్రద్ధాదాస్ గత కొంతకాలంగా సైలెంట్ అయిపోయిన సంగతి తెలిసిందే. కెరీర్ అంతంత మాత్రమే. ఆశించిన రేంజును అందుకోలేక సతమతమవుతోంది. అయినా సోషల్ మీడియాల్లో టెంప్టింగ్ లుక్స్ అల్ట్రా రిచ్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందాల ఆరబోతలో శ్రద్ధాదాస్ ని కొట్టేవాళ్లెవరూ లేరు. ఎంత మంది పోటీలో ఉన్నా ఈ బెంగాలీ బాలిక ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. కెరీర్ పరంగా అంతగా సక్సెస్ కాకపోయినా శ్రద్ధా పేరు ఇంకా వినబడుతుందంటే కారణం తనలోని కొన్ని ప్రత్యేకమైన వైబ్రేంట్ క్వాలిటీస్ అనే చెప్పాలి. మరోసారి కొత్త ఫోటో షూట్ తో ఆకట్టుకుంటోంది. మినీ స్కర్ట్ ధరించి క్యూట్ గా నవ్వేస్తూ కనిపించింది. పనిలో పనిగా థై అందాల ఎలివేషన్ తో కుర్రకారు గుండెల్లో బౌన్సర్ల తాకిడి తప్పలేదు. వైట్ కలర్ టాప్.. కాంబినేషన్ బాటమ్ శ్రద్ధాకి యాప్ట్ గా కుదిరింది. అలా టేబుల్ పై కుచుని కిందకు చూస్తూ క్యూట్ స్మైల్ ఇస్తూ ఫోటో సెషన్ లో పాల్గొంది. మునుపటితో పోలిస్తే ఈసారి బోల్డ్ యాంగిల్ కి దూరంగా ఉంటూ సెషన్ లో పాల్గొంది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. శ్రద్ధా అభిమానులు కామెంట్లతో హీటెక్కిస్తున్నారు. ఇక శ్రద్ధా దాస్ కెరీర్ విషయానికి వస్తే.. వెబ్ సిరీస్ లు కొంత వరకూ తనని ఆదుకున్నాయి. వెండి తెరపై పెద్ద బిజీ నటి కాలేకపోయినా వెబ్ సిరీస్ ల్లో బాగానే అవకాశాలు వస్తున్నాయి త ె ల ం గ ా ం ల ో నీరిక్షణ%--..--%అర్ధం అనే రెండు సినిమాల్లో నటిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు చిత్రాలు సెట్స్ లో ఉన్నాయి. షూటింగ్ చాలా కాలం క్రితం ప్రారంభమైనా కానీ మళ్లీ ఎలాంటి అప్ డేట్ లేదు. కోవిడ్ క్రైసిస్ కారణంగా మధ్యలో నిలిచిపోయాయా? లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ బ్యూటీ టాలీవుడ్ లో సిద్ధు ఫ్రం శ్రీకాకుళం చిత్రంతో హీరోయిన్ గా పరిచయమైన సంగతి తెలిసిందే. అటుపై మీడియం బడ్జెట్ చిత్రాల్లో నటించింది. ఆర్య -2 సినిమాతో నటిగా మంచి పేరొచ్చింది. బాలీవుడ్ లో..శాండిల్ వుడ్ లోనూ కొన్ని సినిమాలు చేసింది. కానీ ఆ భాషల్లోనూ సక్సెస్ కాలేదు. ప్యూర్ సోల్ అనే ఓ ఇంగ్లీష్ చిత్రంలోనూ నటించింది. కానీ ఏవి కలిసి రాలేదు. ప్రస్తుతం ఓటీటీ వెబ్ సిరీస్ ల్లో బిజీగా ఉంది.

## అఖండ సంచలనం.. శాతకర్ణి-వకీల్ సాబ్ రికార్డులు బ్రేక్



సింహా నందమూరి బాలకృష్ణ మాస్ పవర్ ఎంతో మరోసారి ప్రూవ్ అయ్యింది. బాక్సాఫీస్ వద్ద అఖండ ఓపెనింగ్ డే సరికొత్త రికార్డులను అందుకుంటోంది. ఈ చిత్రం గౌతమిపుత్ర శాతకర్ణి.. వకీల్ సాబ్ ల యుఎస్ రికార్డులను సైతం బ్రేక్ చేసిందనేది ట్రేడ్ రిపోర్ట్. మాస్ జాతరకు అసలైన అర్థం చూపిస్తూ బాక్సాఫీస్ దగ్గర బాలయ్య సత్తా చాటుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ సినిమా రికార్డు ఓపెనింగ్స్ తెచ్చుకుంది. ట్రేడ్ పండితుల లెక్కలు ప్రకారం తెలుగు రాష్ట్రాల్లోనే భారీ షేర్ వసూలు చేసింది. అఖండ డే1 తెలుగు రాష్ట్రాల్లో అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించింది. 14.60 కోట్ల డిస్ట్రిబ్యూటర్ షేర్ వసూలు చేసింది. గౌతమీపుత్ర శాతకర్ణి (ఇది 9.76 కోట్లు వసూలు చేసింది)ని వెనక్కి నెట్టేస్తూ.. %చీదీఖ% చిత్రం సాధించిన అత్యధిక ఓపెనింగ్స్ ఇదే. కోస్తా ఆంధ్రాలో 4 షోల ఆంక్షల వల్ల సినిమా దెబ్బతింది. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ కోసం తెలుగు రాష్ట్రాల్లో 49 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

ప్రాంతాల వారీగా డే1 షేర్లు

పరిశీలిస్తే.. అఖండ షేర్లు ఇలా ఉన్నాయి. నైజాం : 4.37 కోట్లు-సీడెడ్ : 3.25 కోట్లు-: 1.39 కోట్లు- గుంటూరు : 1.87 కోట్లు- తూర్పు : 1.05 కోట్లు- వెస్ట్: 0.94 కోట్లు-కృష్ణా : 0.81 కోట్లు-నెల్లూరు : 0.93 కోట్లు కలుపుకుని ఓవరాల్ గా 14.61 కోట్లు వసూలైంది. (9.76 కోట్లు)ని అధిగమించిని ఇప్పటివరకు అత్యధిక ఓపెనింగ్ లను సాధించాడు. సెకండ్ వేవ్ అనంతరం తెలుగు సినిమాకి అత్యధిక ఓపెనింగ్ ఇదే.

అమెరికాలోనూ రికార్డులు


అమెరికాలో వకీల్ సాబ్ రికార్డులను అఖండ అధిగమించింది. నార్త్ అమెరికాలో బాలయ్య హవా సాగింది. అఖండ సినిమాకు ప్రీమియర్స్ నుంచే 3.25 లక్షల డాలర్లు (దాదాపు 2.75 కోట్లు) వసూలు కాగా..బాలయ్య కెరీర్ మూడో బెస్ట్ ఓపెనింగ్ లతో అఖండ సత్తా చాటింది. ఎన్టీఆర్ కథానాయకుడు -3.74 లక్షల డాలర్లు.. గౌతమీపుత్ర శాతకర్ణి 3.50 లక్షల డాలర్లు వసూలైంది. ఇప్పుడు అఖండ మూడో స్థానం దక్కించుకుంది.

ఇంతకుముందు అమెరికాలో వకీల్ సాబ్ 3 లక్షల డాలర్లు వసూలు చేయగా.. నాగ చైతన్య- కమ్ముల లవ్ స్టోరీ 3.13 లక్షల డాలర్లను వసూలు చేసింది. ఈ రెండిటి రికార్డులను అఖండ బ్రేక్ చేసింది. ఇంటా బయటా అఖండ వసూళ్ల హవా కొనసాగుతోంది. అమెరికాలో బాలకృష్ణ ఫ్యాన్స్ రచ్చ గురించి తెలిసిందే.



## థమన్ దంపుడికి థియేటర్లకు బీటలు!

నటసింహా నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా తెరకెక్కిన అఖండ డిసెంబర్ 2న వరల్డ్ వైడ్ గా రిలీజైన సంగతి తెలిసిందే. పక్కా బోయపాటి మార్క్ చిత్రంగా టాక్ వచ్చింది. భారీ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ చిత్రం ఓ సెక్షన్ ఆడియన్ ని బాగానే ఆకట్టుకుంటోంది. ఇక సంగీత దర్శకుడు థమన్ అందించిన బీజీఎమ్ అయితే మామూలుగా లేదు. హెయిర్ రైటింగ్ బీజీఎమ్ తో సౌండ్ ఎఫెక్ట్స్ అందించడంలో థమన్ తనకి తానే సాటి అని మరోసారి నిరూపించారు. నేపథ్య సంగీతం సినిమాను నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లింది. దీంతో థియేటర్ ఎక్స్ పీరియన్స్ ఎలా ఉంటుంది? అన్నది థమన్ చెప్పకనే చెప్పారు. అయితే ఇండియాలో సౌండ్ పరంగా వయోలెన్స్ ఎలా ఉన్నా పర్వాలేదు. భారతీయ చట్టాల ప్రకారం మ్యానేజ్ చేసేయొచ్చు. కానీ ఇతర దేశాల్లో అలా కుదరదు కదా. అందులోనూ అమెరికా లాంటి దేశంలో అన్ లిమిటెడ్ సౌండింగ్ కి చట్టాలు ఒప్పుకోవు. థమన్ దెబ్బకి అమెరికాలోని సినిమార్క్ థియేటర్ బాక్సులు బద్దలైనట్లే తెలుస్తోంది. సాధారణ డెసిబిల్స్ స్థాయిని మించి సౌండింగ్ ఉండటంతో ఆడియన్స్ తో పాటు..స్పీకర్లు కూడా పగిలిపోతాయని యాజమాన్యం ఓ లేఖని సైతం రిలీజ్ చేసింది. సినీ మార్క్ తరలి వచ్చే ప్రేక్షకులందరికీ విషయాన్ని ముందే చెబుతూ అసౌకర్యానికి చింతిస్తున్నామని బయట బోర్డులు కూడా ఏర్పాటు చేసారు. అలాగే సౌండింగ్ విషయంలో విదేశీ చట్టాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకూ ఇలాంటి ఎక్స్ పీరియన్స్ ని ఏ మ్యూజిక్ డైరెక్టర్ ఫేస్ చేసి ఉండరు. ఆ రకంగా థమన్ తొలి మ్యూజిక్ డైరెక్టర్ అవుతారు. బాలయ్య కోసం థమన్ ఎంత హార్డ్ వర్క్ చేసారో ఎంతగా శ్రద్ధ పెట్టారో ఈ సన్నివేశం చెప్పకనే చెబుతుంది. ఇండియాలో ఇలాంటివి పెద్దగా ఎవరూ పట్టించుకోరు. ఎంత వాయిస్తే అంత మైలేజ్ సినిమాకి ఉంటుంది. అదీ లెక్క మరి ఇక్కడ.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com